

సంచలన వార్తలకు నేడు TELUGU DAILY
# విలేకరులు కావలెను
అనతి కాలంలోనే పత్రికా రంగంలో ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్న *నేడు తెలుగు దినపత్రిక* లో పనిచేసేందుకు రిపోర్టర్లు కావలెను.
తెలంగాణలోని 33 జిల్లాలో పనిచేసేందుకు
వార్త సేకరణలో అనుభవం కలిగిన స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు తీసుకోబడును.
ఆసక్తి కలిగిన వారు nedudailynews@gmail.com కు బయోడేటా పంపించండి
ఈ నెంబర్లకు ఫోన్ చేయగలరు.
9346984911 | 9133445456



సంచలన వార్తలకు
# నేడు
TELUGU DAILY

శనివారం | 19.09.2026 | సంపుటి : 4 | సంచిక : 142 | పేజీలు : 8 | వెల : 2/- | www.nedudailynews.com




మిశ్రమంగా ముగిసిన సూచీలు 08

# దానం నాగేందర్‌పై అనర్హత వేటు

పార్టీ ఫిరాయించినట్లు నిర్ధారణ.. శాసనసభ సభ్యత్వానికి అనర్హుడిగా ప్రకటన

అసెంబ్లీ స్పీకర్ జారీ చేసిన ఉత్తర్వులు రద్దు చేస్తూ సీజే ధర్మాసనం సంచలన తీర్పు

2024 ఏప్రిల్ 23 నుంచి ఖైరతాబాద్ నియోజకవర్గ స్థానం ఖాళీగా ఉన్నట్లేనని వెల్లడి

స్పీకర్ నిర్ణయాలు న్యాయ-సమీక్షకు అతీతం కాదు

అనర్హత పిటిషన్‌లపై స్పీకర్ తీర్పు రద్దు

బీఆర్‌ఎస్, భాజపా పిటిషన్‌లను అనుమతిస్తూ హైకోర్టు తీర్పు



బీఆర్‌ఎస్ తరపున ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి ఎన్నికై కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన దానం నాగేందర్‌పై హైకోర్టు శుక్రవారం అనర్హత వేటు వేసింది. 2024 ఏప్రిల్ 23 నుంచి అనర్హత అమల్లోకి వచ్చినట్లు పేర్కొంది.

హైదరాబాద్, సెప్టెంబర్ 18 : దానం నాగేందర్‌పై దాఖలైన అనర్హత పిటిషన్‌లను కొట్టివేస్తూ స్పీకర్ వెలువరించిన తీర్పులను రద్దు చేస్తూ హైకోర్టు శుక్రవారం 91 పేజీల తీర్పు వెలువరించింది. స్పీకర్ తీర్పును రద్దు చేయాలని కోరుతూ భారాస, భాజపాలు దాఖలు చేసిన పిటిషన్‌లను అనుమతించింది. భారాస సభ్యుడిగా ఉంటూ కాంగ్రెస్ అభ్యర్థిగా 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసినందున రాజ్యాంగంలోని పదో షెడ్యూలు పేరా 2(1)(ఎ) రెడ్‌విత్ 191(2) ప్రకారం దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటిస్తున్నట్లు పేర్కొంది. అనర్హత నేపథ్యంలో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీగా ఉన్నట్లు పరిగణనలోకి తీసుకోవాలంది. ఈ ఉత్తర్వుల ప్రతిని స్పీకర్ కార్యదర్శికి, ఎన్నికల సంఘానికి పంపాలని రిజిస్ట్రీని ఆదేశించింది. దానంపై అనర్హత

-మిగతా 2 లో..



## అర్హులైన గ్రామీణ కుటుంబాలకు పక్కా ఇళ్ల నిర్మాణం

తెలంగాణకు 2 లక్షల పీఎంఏవై-జీ గృహాలు

సీఎం రేవంత్‌రెడ్డికి మంజూరు లేఖ ఇచ్చిన కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్

కృతజ్ఞతలు తెలిపిన ముఖ్యమంత్రి

మిగిలిన 9.56 లక్షల ఇళ్లు కేటాయించాలని వినతి

'ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్(పీఎంఏవై-జీ)' కింద 2026-27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రానికి 2 లక్షల ఇళ్ల నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్ శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సంబంధిత లేఖ అందించారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 18 : హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో కేంద్ర మంత్రిని సీఎం మర్యాదపూర్వకంగా కలిశారు. సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 'పీఎంఏవై-జీ' పథకంలో భాగంగా మొదటి విడతగా రాష్ట్రానికి 2 లక్షల ఇళ్లను కేటాయించిన సందర్భంగా కేంద్ర మంత్రికి సీఎం కృతజ్ఞతలు తెలిపారు. గత జులైలో దిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి తెలంగాణలో 11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వినతి పత్రం అందించిన

-మిగతా 2 లో..



## పుట్టిన బిడ్డకు బంగారు ఉంగరం

28న 'మేనమామ బంగారు ఉంగరం' పేరుతో ప్రారంభించనున్న సీఎం విజయ్

ఎన్నికల హామీని నెరవేర్చేందుకు టీవీకే ప్రభుత్వం సిద్ధం

చెన్నై, సెప్టెంబర్ 18 : ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మరో హామీని నెరవేర్చేందుకు సీఎం విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం సిద్ధమైంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో జన్మించిన ప్రతి చిన్నారికీ ఒక గ్రాము బంగారు ఉంగరం ఇచ్చే పథకాన్ని ఈ నెల 28 నుంచి ప్రారంభించబోతున్నట్లు ప్రభుత్వం వెల్లడించిం ది. 'మేనమామ బంగారు ఉంగరం' పేరుతో ఈ పథకాన్ని సీఎం విజయ్ లాంఛనంగా ప్రారంభించనున్నారు. జూన్ 22 నుంచి పుట్టిన ప్రతి చిన్నారికీ ఈ పథకాన్ని

- మిగతా 2 లో..

## 22ఏ సమస్యల పరిష్కారానికి ఉన్నత స్థాయి కమిటీ

క్రమబద్ధికరణపై ప్రభుత్వం నిర్ణయం

సీసీఎల్ఏ చైర్మన్‌గా కమిటీ ఏర్పాటు చేశాం

శాసనసభలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటన

నిషేధిత కేటగిరీలో ఉన్న భూసమస్యలను వేగవంతంగా పరిష్కరిస్తున్నట్టు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. 22ఏ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన కార్యాచరణ చేపట్టిందన్నారు. శుక్రవారం శాసనసభలో జీరోఅవర్‌లో 22ఏపై మంత్రి ప్రత్యేక ప్రకటన చేశారు.



హైదరాబాద్, సెప్టెంబర్ 18 : 22ఏ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. 22ఏ విషయంలో మొత్తం 12 రకాల అంశాలను ప్రభుత్వం గుర్తించిందన్నారు. వీటిని గరిష్టంగా నెలరోజుల్లో పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలో జీఓ 118 ద్వారా క్రమబద్ధికరణ చేసేందుకు 9,792 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. రేవంత్‌రెడ్డి మల్కాజిగిరి ఎంపీగా ఉన్న సమయంలో ఈ అంశాన్ని పరిష్కరిస్తామని బాధితులకు

-మిగతా 2 లో..



## దళితుల భూమి కబ్జా చేయలేదని తేలితే రాజీనామాకు సిద్ధమా?

దమ్ముంటే సవాల్‌ను స్వీకరించండి

దొంగే.. దొంగ అని అరిచినట్టు కాంగ్రెస్ వ్యవహారం

22ఏతో లక్షలాది మందికి నరకం

రాష్ట్ర హక్కుల కోసం కేంద్రంపై దండయాత్ర చేయండి

బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం

'కేసీఆర్ వద్ద ఎలాంటి దళితుల భూమి లేదని తేలితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నారా? ఒకవేళ ఉంటే మేమంతా రాజీనామా చేయడానికి సిద్ధం' అని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్ చేశారు. ధరణి, భూ వ్యవహారాలపై విచారణల పేరుతో హడావుడి చేసి చివరికి తోకముడిచారని విమర్శించారు. భూముల వ్యవహారంపై తాను గతంలోనే సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారని గుర్తుచేశారు.

03

## రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వండి

కేంద్రాన్ని కోరుతూ శాసనసభ ఏకగ్రీవ తీర్మానం

ఎఫ్ఆర్‌బీఎం రుణ పరిమితిని జీఎస్‌డీపీలో 3 శాతం నుంచి 3.5 శాతానికి పెంచాలి

అలాగే 1,500 మెగావాట్ల విద్యుత్ కేటాయించాలి

అసెంబ్లీలో 8 అంశాలతో కూడిన తీర్మానం.. ఆమోదించిన సభ



హైదరాబాద్, సెప్టెంబర్ 18 : 'తాగు, సాగునీటి అవసరాలు, కరువు నివారణ చర్యలకు కేంద్ర ప్రభుత్వం రూ.20 వేల కోట్ల ప్రత్యేక సహాయ ప్యాకేజీ మంజూరు చేయాలి. చెరువులు, నీటి వనరుల పునరుజ్జీవం, పురోగతిలో ఉన్న సాగు నీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడానికి వివిధ కేంద్ర పథకాల కింద తగిన సహాయం అందించాలి' అని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ శాసనసభ ఏకగ్రీవ తీర్మానం చేసింది. శుక్రవారం శాసనసభలో ఎల్‌నినోపై లఘు చర్చ సందర్భంగా సభ్యులు లేవనెత్తిన అంశాలపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వం

-మిగతా 2 లో..



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 107 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 134 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 208 (కిలో) |
| స్కిన్ లెస్ | 235 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹78

## బాలికపై గ్యాంగ్‌రేప్

తర్వాత ఆమెను కత్తితో పొడిచి హత్య

మృతదేహాన్ని పీక్కుతిన్న కుక్కలు

రాజధాని ఢిల్లీ లో దిగ్భ్రాంతికర ఘటన

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18 : దేశ రాజధాని దిల్లీలో దిగ్భ్రాంతికర ఘటన వెలుగుచూసింది. నమ్మి స్నేహితుల వెంట వెళ్లిన ఓ బాలిక.. వారి చేతుల్లో సామూహిక అత్యాచారానికి గురైంది. వారు ఆమెను చంపి, పొలాల్లోకి విసిరేశారు. ఆ తర్వాత మృతదేహాన్ని కుక్కలు పీక్కుతినడం సంచలనంగా మారింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. దిల్లీకి చెందిన 17 ఏళ్ల బాలిక స్నేహితుడిని కలిసేందుకు బయటకు వెళ్లింది. ఆ ఫ్రెండ్‌తో

-మిగతా 2 లో..





## బెంగాల్ ఉప పోరు..

దీదీ వర్గానికి 'ఫుట్‌బాల్ ప్లేయర్' గుర్తు 03

## రేవంత్.. మా ఆస్తులు తీసుకుని రూ.వెయ్యి కోట్లు ఇవ్వండి

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, సెప్టెంబర్ 18 : బీఆర్‌ఎస్ నాయకత్వాన్ని ఇబ్బంది పెట్టాలనేదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మ్యానిఫెస్టో అమలుపై కాకుండా బీఆర్‌ఎస్ నేతలను టార్గెట్ చేశారని ఆరోపించారు. ఫార్ములా ఈ-రేస్ కేసులో నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టులో

-మిగతా 2 లో..



## 22ఏ సమస్యల పరిష్కారానికి ఉన్నత స్థాయి కమిటీ

(మొదటిపేజీ తరువాయి)

హామీ ఇచ్చారని మంత్రి పొంగులేటి వివరించారు. ఈ హామీకి అనుగుణంగా బాధితులకు న్యాయం చేసేందుకు జీఓ 118 సమస్యల పరిష్కారానికిగాను శుక్రవారం మెమో జారీ చేసిందని వివరించారు. దాదాపు 22, 23 కాలనీలు ఈ సమస్యను ఎదుర్కొంటున్నాయని, శనివారం మధ్యాహ్నం అర్హతలున్న వారికి క్రమబద్ధీకరణ చేసి పట్టాలు పంపిణీ చేస్తామని, నిషేధిత జాబితా నుంచి ఆయా ప్లాట్లను తొలగిస్తామన్నారు. సింగరేణి పరిధిలోని ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ విషయంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో ఆ ప్రాంత ఎమ్మెల్యేలతో శనివారం అసెంబ్లీ హాలులో సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్న సమయంలో జారీ చేసిన జీఓ 76పై ఈ సందర్భంగా చర్చిస్తామన్నారు. సమావేశం అనంతరం ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని మంత్రి వెల్లడించారు. అధీకృత లేఅవుట్‌లకు సంబంధించి 22ఏ నుంచి విముక్తి కల్పించేందుకు ప్రభుత్వం రెండు రోజుల్లో సానుకూల నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ చట్టం--1908లోని సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో చేర్చిన ఆస్తులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, సమస్యలను పరి ష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి చైర్మన్‌గా భూపరిపాలన ప్రధాన కమిషనర్ డీఎస్.లోకేశ్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీలో సభ్యులుగా న్యాయ, శాసన వ్యవహారాలు, న్యాయశాఖ ప్రభుత్వ కార్యదర్శి పాపిరెడ్డి సభ్యులుగా మెంబర్ కన్వీనర్‌గా రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఉంటారు. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి లోకేశ్‌కుమార్ శుక్రవారం జీఓ 564 జారీ చేశారు. సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో ఉన్న ఆస్తులకు సంబంధించిన పెండింగ్ కేసులను ఈ కమిటీ పరిశీలించి పరిష్కరించనుంది. జీహెచ్ఎంసీ, డీటీసీపీ, హెచ్ఎండీఏ అధికారుల అనుమతులతో ఆమోదం పొందిన లేఅవుట్లలోని ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన పెండింగ్ వ్యవహారాలను పరిశీలిస్తుంది. సికింద్రాబాద్ ప్రాంతంలో లీజుహోల్డ్ ఆస్తులను ఫ్రీహోల్డ్‌గా మార్చే అంశాలపైనా నిర్ణయం తీసుకోనుంది. పెండింగ్ కేసుల పరిశీలనలో భాగంగా అవసరమైన రికార్డులు, సమాచారాన్ని ఏ శాఖ నుంచైనా, శాఖాధిపతులు లేదా జిల్లా కలెక్టర్ల నుంచి కమిటీ కోరవచ్చు. అవసరమైతే ఇతర అధికారులను కూడా కమిటీలో సహ సభ్యులుగా చేర్చుకునే అధికారం ప్రభుత్వం కల్పించింది. దీంతో 22ఏ నిషేధిత జాబితా కారణంగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన పలు ఆస్తుల వ్యవహారాలకు పరిష్కారం లభించే అవకాశం ఏర్పడింది. జీఓ 118 దరఖాస్తుల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్లకు ఆదేశాలిస్తూ రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్ శుక్రవారం మెమో 46940 జారీ చేశారు. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా నెలరోజుల్లో ఈ సమస్యను పరిష్కరించాలన్నారు.

# దానంపై అనర్హత వేటు

(మొదటిపేజీ తరువాయి)

వేటు వేయాలంటూ భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డిలు వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్‌లను స్పీకర్ కొట్టివేశారు. స్పీకర్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ వారిద్దరూ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం సుదీర్ఘ వాదనల అనంతరం ఆగస్టు 21న తీర్పు వాయిదా వేసింది. శుక్రవారం ఈ పిటిషన్‌లపై తీర్పు వెలువరించింది. దానం తరఫు న్యాయవాది జోక్యం చేసుకుంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించడానికి తీర్పు అమలును ఆరు నెలలపాటు నిలిపివేయాలని అభ్యర్థించారు. దానిపై ధర్మాసనం జోక్యం చేసుకుంటూ అనర్హత వేటు పడిన తరువాత ఒక్క రోజు కూడా కొనసాగలేరంటూ సుప్రీంకోర్టు స్పష్టం చేసిన విషయాన్ని ప్రస్తావించింది. తీర్పు అమలు నిలిపివేతకు నిరాకరించింది. తీర్పులోని ముఖ్యాంశాలు... "కిహోటో హోలోహాన్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పదో షెడ్యూలు కింద ట్రైబ్యునల్ ఛైర్మన్‌గా స్పీకర్ వ్యవహరిస్తారు. ఆ హోదాలో తీసుకున్న నిర్ణయాలు న్యాయసమీక్షకు లోబడి ఉంటాయి. స్పీకర్ నిర్ణయంలో రాజ్యాంగ ఆదేశాల ఉల్లంఘన, దురుద్దేశం, సహజ న్యాయసూత్రాలకు విరుద్ధం, విపరీత ధోరణి ఉన్నప్పుడు న్యాయసమీక్ష చేయవచ్చు. దానం.. భారాస నుంచి ఎన్నికై 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున బరిలో దిగి భారాసకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించారు. దానికి సంబంధించి పిటిషనర్లు ఆధారాలుగా రిటర్నింగ్ అధికారికి సమర్పించిన ఫారం-26 (ఎన్నికల అఫిడవిట్), ఇతర పత్రాలను అందజేశారు. కాంగ్రెస్ తరఫున నామినేషన్ వేసినట్లు దానం అంగీకరించారు. అయినప్పటికీ స్పీకర్ అనర్హతను తిరస్కరిస్తూ పేర్కొన్న కారణాలు రాజ్యాంగంలోని అధికరణ 191(2) రెడ్‌విత్ పదో షెడ్యూలులోని 2(1)(ఎ), 2(1)(బి)లను ఉల్లంఘించేలా ఉన్నాయి. డాక్టర్ మహాచంద్రప్రసాద్‌సింగ్ కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన అంశాలను కనీసం చర్చించలేదు. ఫిరాయింపుల వల్ల కలిగే అస్థిరత నుంచి సభను కాపాడటానికి స్పీకర్‌కు ప్రత్యేకమైన, పరిమితమైన అధికారాలు ఉన్నాయి. సభ పనితీరుపై ప్రభావం చూపని బాహ్య విషయాలను నియంత్రించడానికి ఈ అధికారాన్ని వినియోగించడాన్ని రాజ్యాంగం అనుమతించదు. సభ వెలుపల జరిగిన రాజకీయ కార్యకలాపాల ఆధారంగా అనర్హతను నిర్ణయించలేమన్న స్పీకర్ వాదన అంగీకారయోగ్యం కాదు. శాసనసభ్యుడి చర్యలు కేవలం శాసనసభకే పరిమితం కాదు. పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదిలిపెట్టాడా లేదా అన్నది నిర్ధారించడానికి సభ వెలుపల సభ్యుడి ప్రవర్తనను పరిగణనలోకి తీసుకోవచ్చు. భారాస సభ్యుడిగా ఉంటూ కాంగ్రెస్ తరఫున పోటీ చేసినందున స్వచ్ఛందంగా



### సుప్రీంకోర్టుకు వెళ్లే ఆలోచన లేదు: దానం

తనపై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నానని దానం నాగేందర్ స్పష్టం చేశారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని తన నివాసం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్లే ఆలోచన లేదని అన్నారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో పోటీకి తాను సిద్ధమని ప్రకటించారు. ఎన్నికలు తనకు కొత్తకాదని తెలిపారు. ఇక్కడి వరకు యుద్ధం చేసే వచ్చానని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో పోరాడి మళ్లీ గెలుస్తానని విశ్వాసం వ్యక్తం చేశారు.

భారాస సభ్యత్వాన్ని వదులుకున్నట్లే. కాంగ్రెస్ తరఫున పోటీ చేయడం అన్నది పదో షెడ్యూలులోని 2(1)(ఎ) ప్రకారం భారాస సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకోవడం అవుతుందా లేదా అన్నదానిపై స్పీకర్ సమాధానమిస్తూ.. 'శాసనసభ్యుడిగా ఉంటూ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడాన్ని రాజ్యాంగపరంగా నిషేధించలేదు. ఒకవేళ మరో పార్టీ టికెట్‌పై లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడాన్ని పార్టీ ఫిరాయింపుగా పరిగణించాల్సి వస్తే రాజ్యాంగం దాన్ని స్పష్టంగా పేర్కొని ఉండేది. అలా నిర్దేశించనప్పుడు అనర్హతను నిర్ధారించలేం. ఎన్నికైన ప్రతినిధిని పిటిషనర్ ఊహాజనిత మీడియా నివేదికల ఆధారంగా అనర్హుడిగా ప్రకటించలేం' అని స్పీకర్ పేర్కొన్నారు. ఈ నిర్ణయం డాక్టర్ మహాచంద్రప్రసాద్‌సింగ్ కేసుతోపాటు ఇతర కేసుల్లో సుప్రీంకోర్టు పేర్కొన్న న్యాయసూత్రాల దృష్ట్యా అసంబద్ధంగా ఉంది. ఒక పార్టీకి చెందిన సభ్యుడు మరో పార్టీతో రాజకీయ అనుబంధం ఏర్పరచుకుని పోటీ చేయడం వంటి చర్యలు స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వాన్ని వదులుకున్నట్లు నిర్ధారించుకోవడానికి ఆధారాలుగా పరిగణించవచ్చు. స్పీకర్ నిర్ణయం రాజ్యాంగ ఉల్లంఘనలతో ఉండటం వల్ల దాన్ని సమర్థించలేం. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున దానం రిటర్నింగ్ అధికారికి ఇచ్చిన అఫిడవిట్‌తోపాటు, అసెంబ్లీ ఎన్నికల్లో భారాస తరఫున పోటీ చేస్తూ ఇచ్చిన అఫిడవిట్‌ను పిటిషనర్లు ఆధారాలుగా సమర్పించారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్, ఫలితాల ప్రకటనలనూ సమర్పించారు. పోటీలో ఉన్న వారి వివరాలను అదనపు కలెక్టర్ విడుదల చేసిన జాబితాలో దానం పేరు ఫొటోతో సహా ఉంది. అయితే వీటన్నింటికీ ధ్రువీకరణ లేనందున తిరస్కరిస్తున్నామన్న స్పీకర్ వాదన బీఎస్ఏ సెక్షన్ 80, 81 ప్రకారం నిలబడదు. ఎమ్మెల్యేగా ఉంటూ కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన విషయాన్ని దానం ఖండించనందున పదో షెడ్యూలులోని పేరా 2(1)(ఎ) వర్తిస్తుంది. ఒక పార్టీకి చెందిన సభ్యుడు మరో పార్టీ తరఫున ఎన్నికల్లో పోటీ చేస్తే ఆ వ్యక్తి స్వచ్ఛందంగా అసలు రాజకీయ పార్టీ సభ్యత్వాన్ని వదులుకున్నట్లేనని ఇదే హైకోర్టు ఆర్.భూపతిరెడ్డి కేసులో తీర్పు వెలువరించింది. పిటిషనర్లు సమర్పించిన ఆధారాలను దానం తిరస్కరించలేదు. వారు సమర్పించిన రికార్డుల్లోని సాక్ష్యాధారాలను, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోవడంలో స్పీకర్ విఫలమయ్యారు. స్పీకర్ నిర్ణయం లోపభూయిష్టంగా ఉంది. భారాస.. దానంపై అంతర్గతంగా క్రమశిక్షణ చర్యలు తీసుకోలేదన్న అంశాన్ని స్పీకర్ పరిగణనలోకి తీసుకోవడం సరికాదు. పదో షెడ్యూలు కింద అనర్హత చర్యలు తీసుకునే పరిస్థితులు ఏర్పడినా రాజకీయ పార్టీ అంతర్గత చర్యలు తీసుకోకపోతే అనర్హత చెరిగిపోదు. పదో షెడ్యూలు కింద విచారణను సాధారణ సివిల్, క్రిమినల్ కేసుల విచారణతో సమానంగా పరిగణించలేం. అందుబాటులో ఉన్న విశ్వసనీయమైన అధికారిక రికార్డులను పరిశీలించి నిర్ధారించాల్సి ఉంటుంది. ప్రస్తుత అనర్హత ప్రక్రియ ఏడాదిన్నరకుపైగా సాగుతూనే ఉంది. ఇప్పటికే శాసనసభ పదవీ కాలంలో దాదాపు మూడేళ్లు గడిచిపోయాయి. ఈ విషయంపై కొత్తగా నిర్ణయం తీసుకోవడానికి తిరిగి స్పీకర్‌కు పంపాల్సిన అవసరంలేదు. ఈ పరిస్థితుల్లో న్యాయసమీక్ష అధికారాలను వినియోగిస్తూ భారాస సభ్యుడిగా ఉంటూ కాంగ్రెస్ తరఫున పోటీ చేసినందున అనర్హుడిగా ప్రకటించడం సముచితం. ఫలితంగా అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లుగా పరిగణించాలి" అని తీర్పులో పేర్కొంది. దానంపై అనర్హత వేటు వేయాలంటూ 2024 ఏప్రిల్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో భారాస సుప్రీంకోర్టును ఆశ్రయించింది. మూడు నెలల్లో నిర్ణయాన్ని వెలువరించాలంటూ 2025 జులై 31న స్పీకర్‌కు గడువు విధించడంతో ఈ మార్చి 11న స్పీకర్ తీర్పు వెలువరించారు. స్పీకరు నిర్ణయాన్ని సవాలు చేస్తూ పిటిషన్‌లు దాఖలయ్యాయి. పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న మిగిలిన ఎమ్మెల్యేల పిటిషన్‌లపై విచారణ అక్టోబరులో జరగనుంది.



## పుట్టిన బిడ్డకు బంగారు ఉంగరం..

(మొదటిపేజీ తరువాయి)

వర్తింపజేయనున్నారు. ఇప్పటికే 1.28 లక్షల ఉంగరాలను ప్రభుత్వం సిద్ధం చేసినట్లు సమాచారం. అయితే, ఉప ఎన్నికలు జరగనున్న మదురాంతకం, ధారాపురం నియోజకవర్గాల్లో మాత్రం ఈ పథకం అమలుకు తాత్కాలిక బ్రేక్ పడనుంది. ఉచిత అల్పాహార పథకం విస్తరణకు మాత్రమే ఎన్నికల సంఘం నుంచి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి పొందిందని, బంగారు ఉంగరం పథకానికి అనుమతి లేదని ఈసీ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వ వర్గాల ప్రకారం తమిళనాడులో ఏటా 7.8 లక్షల జననాలు నమోదవుతాయి. వాటిలో దాదాపు 4.2 లక్షల మంది ప్రభుత్వ ఆస్పత్రుల్లో జన్మించినవారే. వారందరికీ ఈ పథకాన్ని వర్తింపజేయనున్నారు.

## రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వండి

(మొదటిపేజీ తరువాయి)

ఎనిమిది అంశాలపై తీర్మానం ప్రవేశపెట్టగా, అన్ని రాజకీయ పార్టీలు ఈ తీర్మానానికి మద్దతు ఇవ్వాలని భట్టి కోరారు. అనంతరం సభ్యులు తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. 2026--27 ఆర్థిక సంవత్సరానికి ఎఫ్ఆర్‌బీఎం రుణ పరిమితిని జీఎస్‌డీపీలో 3 శాతం నుంచి 3.5 శాతానికి పెంచాలి. తద్వారా ఉపశమన, నివారణ చర్యలకు అవసరమైన అదనపు వ్యయాన్ని రాష్ట్రం భరించేందుకు అవకాశం కల్పించాలి. రాష్ట్రానికి అదనంగా 1,500 మెగావాట్ల విద్యుత్ కేటాయించాలి. కేంద్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థల్లో కేటాయించకుండా ఉన్న కోటా నుంచి దీన్ని అందించాలి. విండో-- ఐ కింద 5 మిలియన్ టన్నుల బొగ్గు లింకేజీ నిర్ధారించి రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు రేక్‌ల లభ్యతను పెంచాలి. విద్యుత్ ట్రాన్స్‌మిషన్ చార్జీలను సడలించి, అవసరమైన సాయం అందించాలి. ఎల్‌నినో పరిస్థితులను క్షేత్రస్థాయిలో అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి బృందాన్ని వీలైనంత త్వరగా రాష్ట్రానికి పంపించాలి. జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి (ఎన్‌డీఆర్ఎఫ్) నుంచి తగిన సాయం మంజూరు చేయాలి. రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి (ఎస్‌డీఆర్ఎఫ్)లో కేంద్ర వాటాను సత్వరమే విడుదల చేయాలి. పంట నష్టం/ఇన్‌పుట్ సబ్సిడీ, తాగునీరు, పశుగ్రాసం, పశు సంపద పరిరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణ, చెరువులు, ఇతర జలవనరుల పునరుద్ధరణతోపాటు ఉపశమన చర్యలకు తగిన సహాయం అందించాలి. వీబీజీ--రామ్‌జీ పథకంలో 125 రోజుల పనిదినాలకు అదనంగా మరో 50 రోజుల ఉపాధి కల్పించాలి. ఈ పథకంపై ఖర్చును మొత్తం కేంద్ర ప్రభుత్వమే భరించాలి. రాష్ట్రంలో అమల్లో ఉన్న 60 రోజుల సీజనల్ సస్పెన్షన్ కాలాన్ని సడలించాలి. గ్రామీణ కుటుంబాలకు ఉపాధి భద్రత కల్పించేందుకు లేబర్ బడ్జెట్‌ను తగినంతగా పెంచాలి. రాష్ట్రానికి అవసరమైన ఎరువులను సకాలంలో కేటాయించాలి. ప్రభావిత జిల్లాలకు ముందుగానే రేక్‌ల ద్వారా సరఫరా చేయాలి. పర్ డ్రాప్ మోర్ క్రాప్ (పీడీఎంసీ) కింద కేటాయింపులు పెంచి డ్రిప్ ఇరిగేషన్‌ను వేగంగా విస్తరించాలి. ఎంఐడీహెచ్ కింద కూరగాయల సాగు విస్తీర్ణం పెంపునకు ఆర్థిక సహాయం అందించాలి. ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను సబ్సిడీపై సరఫరా చేయాలి. రైతులు, బలహీన వర్గాల కుటుంబాలను ఆదుకోవడంతోపాటు తక్షణ సహాయ చర్యలు చేపట్టేందుకు కేంద్ర పథకాలు, కేంద్ర ప్రాయోజిత పథకాల కింద అదనపు ఆర్థిక సాయం అందించాలి. అందుకు అవసరమైన తీరుగా నిబంధనలను సడలించాలి.



## అర్హులైన గ్రామీణ కుటుంబాలకు పక్కా ఇళ్ల నిర్మాణం

(మొదటిపేజీ తరువాయి)

విషయం తెలిసిందే. రాష్ట్ర డిమాండ్‌కు అనుగుణంగా మిగిలిన 9.56 లక్షల ఇళ్లను కూడా రాష్ట్రానికి కేటాయించాలని సీఎం కోరారు. తెలంగాణ ప్రభుత్వం ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తుండగా.. ఇందులో కేంద్రం ఇంటికి రూ.72 వేల ఆర్థిక సాయాన్ని అందించనుంది. కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. "దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో 'అందరికీ ఇళ్లు' లక్ష్యంతో.. 2016 ఏప్రిల్ 1 నుంచి పీఎంఏవై-జీ పథకాన్ని కేంద్రం అమలు చేస్తోంది. అర్హులైన గ్రామీణ కుటుంబాలకు ప్రాథమిక సౌకర్యాలతో కూడిన పక్కా ఇళ్ల నిర్మాణానికి ఈ పథకం ద్వారా ఆర్థికసాయం అందుతుంది. 2024 ఆగస్టు 9న జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో పీఎంఏవై-జీని 2029 మార్చి వరకు కొనసాగించాలని నిర్ణయించారు. ఈ కాలంలో గ్రామాల్లో పెరుగుతున్న గృహ అవసరాలను తీర్చేందుకు అదనంగా 2 కోట్ల ఇళ్లను నిర్మించాలనే లక్ష్యాన్ని కేంద్రం నిర్దేశించింది. తెలంగాణలో గత దశలో పీఎంఏవై-జీ అమలు కాలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో 2 లక్షల గృహాల ఆమోదం ఉపయోగపడనుంది. తెలంగాణలో పీఎంఏవై-జీ విజయవంతంగా అమలు చేసేందుకు కేంద్రం పూర్తిగా సహకరిస్తుంది" అని హామీ ఇచ్చారు.



## బాలికపై గ్యాంగ్‌రేప్

(మొదటిపేజీ తరువాయి)

పాటు అతడికి తెలిసిన మరో ముగ్గురు మైనర్లతో కలిసి ఒక టెంపోలో ప్రయాణించింది. ఆ వాహనంలోనే వారు మద్యం తాగి.. బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. ఓచంపేసి, పొలాల్లోకి విసిరేశారని వెల్లడించారు. ఉత్తర దిల్లీలోని స్వరూప్ నగర్ ప్రాంతంలో సెప్టెంబర్ 13న మృతదేహాన్ని గుర్తించారు. మొదట అది అమ్మాయిదో, అబ్బాయిదో గుర్తించలేని విధంగా కుళ్లిపోయిన స్థితిలో కనిపించింది. ఒక చేయి శరీరం నుంచి వేరు పడిందని.. శరీర భాగాలను కుక్కలు పీక్కుతిన్నట్లు అధికారులు ప్రాథమికంగా వెల్లడించారు. ఆ బాలిక ఇంటి నుంచి వెళ్లి రోజులు గడుస్తున్నా.. కుటుంబ సభ్యులనుంచి ఎలాంటి ఫిర్యాదు అందకపోవడం గమనార్హం. ఆమె తరచుగా ఇంటినుంచి బయటకు వెళ్లి, రోజుల తరబడి రాదని కుటుంబ సభ్యులు చెప్పినట్లు పోలీసులు వెల్లడించారు. స్థానికులు అందించిన సమాచారం ఆధారంగా మృతదేహం ఉన్న ప్రాంతానికి పోలీసులు వెళ్లారు. పోక్సోయాక్ట్ కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. సమీపంలోని సీసీటీవీ ఫుటేజీని విశ్లేషించగా.. ఒక దగ్గర టెంపోను గుర్తించారు. దాని ఆధారంగా నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిలో ముగ్గురు మైనర్లు. వారి నుంచి కత్తులను స్వాధీనం చేసుకున్నారు. అసలు ఆరోజు ఏం జరిగిందనే దానిపై పోలీసులు పూర్తి ఆధారాలు సేకరిస్తున్నారు.

## గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన మల్కాజిగిరి సీపీ సుమతి



**హైదరాబాద్:** గణేశ్ నిమజ్జనాలను పురస్కరించుకొని సరూర్‌నగర్ మినీ ట్యాంక్ బండ్‌పై ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ట్యాంక్ బండ్‌పై చేపట్టిన ఏర్పాట్లను మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి సంబంధిత అధికారులతో కలిసి శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. నిమజ్జనం కోసం వచ్చే భక్తులకు అసౌకర్యాలు కలగకుండా అన్ని రకాల భద్రతా చర్యలు చేపట్టామని కమిషనర్ తెలిపారు. సరూర్‌నగర్ చెరువు పరిసరాల్లో పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీస్, జీహెచ్ఎంసీ, విద్యుత్, వైద్య విభాగం తదితర శాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేసేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని కమిషనర్ వివరించారు. చెరువుకట్టపై నిరంతరం నిఘా ఉండేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు పోలీస్ సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. అనంతరం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీసీ కెమెరాల పనితీరును ఆమె పర్యవేక్షించి.. సిబ్బందికి సూచనలు చేశారు. విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్య సేవలు, వైద్య సదుపాయాలతో పాటు నిమజ్జన విధుల్లో పాల్గొనే సిబ్బందికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు సంబంధించిన అధికారులు తెలిపారు. భక్తులందరూ పోలీస్, అధికార యంత్రాంగానికి సహకరించాలని నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కమిషనర్ సుమతి సూచించారు. ఎల్బీ నగర్ డీసీపీ, ఏసీపీ, ట్రాఫిక్ విభాగం, పోలీస్ అధికారులు, సిబ్బంది, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్, వాటర్ వర్క్స్ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## రేవంత్.. మా ఆస్తులు తీసుకుని రూ.వెయ్యి కోట్లు ఇవ్వండి

(మొదటిపేజీ తరువాయి)

విచారణకు హాజరైన అనంతరం మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. "కేసీఆర్ కుటుంబం రూ.లక్ష కోట్లు కొల్లగొట్టినట్లు సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేశారు. ఆయనకు ఆఫర్ ఇస్తున్నా.. మా ఆస్తులు తీసుకుని రూ.వెయ్యి కోట్లు ఇవ్వండి. ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ పెడతా. రూ.లక్ష కోట్లలో మిగిలిన రూ.99 వేల కోట్లతో పథకాలు అమలు చేయండి. పెట్టుబడులు తెచ్చేందుకు ప్రయత్నిస్తే మాపై కేసులు పెట్టారు. హైదరాబాద్‌కు 70 కి.మీ దూరంలో అప్పట్లో ఎకరా రూ.5లక్షల చొప్పున కేసీఆర్ భూమి కొన్నారు. వెయ్యి ఎకరాలు ఆయన దోచుకున్నట్లు గతంలో అసత్య ప్రచారం చేశారు. ఇటీవల 67 ఎకరాలే ఉన్నట్లు అసెంబ్లీలో రేవంతే చెప్పారు. ఎన్ని కేసులు పెడతారో పెట్టుకోండి.. ఏం చేయలేరు" అని కేటీఆర్ అన్నారు.

# దళితుల భూమిని కబ్జా చేయలేదని తేలితే రాజీనామాకు సిద్ధమా?

- దమ్ముంటే సవాల్‌ను స్వీకరించండి
- దొంగే.. దొంగ అని అరిచినట్టు కాంగ్రెస్ వ్యవహారం
- 22ఏతో లక్షలాది మందికి నరకం
- మాపై రాజకీయ కక్షసాధింపు యాత్రలు పక్కన పెట్టండి
- రాష్ట్ర హక్కుల కోసం కేంద్రంపై దండయాత్ర చేయండి
- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం



**సిద్దిపేట, సెప్టెంబర్ 18 :** 'కేసీఆర్ వద్ద ఎలాంటి దళితుల భూమి లేదని తేలితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నరా? ఒకవేళ ఉంటే మేమంతా రాజీనామా చేయడానికి సిద్ధం' అని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్ చేశారు. ధరణి, భూ వ్యవహారాలపై విచారణల పేరుతో హడావుడి చేసి చివరికి తోకముడిచారని విమర్శించారు. భూముల వ్యవహారంపై తాను గతంలోనే సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారని గుర్తుచేశారు. ధరణి, భూభారతి, సంబంధిత ఆస్తుల వ్యవహారాలన్నింటినీ సమగ్రంగా పరిశీలించాలని కోరానని తెలిపారు. ఆ ప్రతిపాదనపై ప్రభుత్వం ముందుకు రాలేదని విమర్శించారు. రాష్ట్రంలో అనేక ప్రజాసమస్యలు ఉన్నాయని, వాటిపై అసెంబ్లీలో చర్చ జరుగాల్సిన సమయంలో భూముల పేరుతో రాజకీయ దుమారం రేపుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయంలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ 420 హామీలు, గ్యారెంటీలపై చర్చ జరుగకుండా.. కాంగ్రెస్ బురద రాజకీయాలకు తెరలేపిందని మండిపడ్డారు. ఎదురుదాడి చేసి తప్పించుకుందాం అనుకుంటే కుదరదని, తమ పోరాటం ఎప్పటికీ ప్రజల పక్షానే ఉంటుందని హెచ్చరించారు. 'నిన్ను ప్రశ్నిస్తూనే ఉంటం.. నిలదీస్తూనే ఉంటం' అని రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి తేల్చిచెప్పారు. రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే కేసీఆర్‌లా రైతులకు 24 గంటల కరెంట్ ఇవ్వాలని డిమాండ్‌చేశారు. నెట్టెంపాడు, కల్వకుర్తి మోటర్లు బంద్ చేసి ఆంధ్రాకు నీళ్లు తరలించి తెలంగాణ రైతులకు అన్యాయం చేస్తున్నారని, కొండపోచమ్మ, రంగనాయక, మల్లన్నసాగర్ ప్రాజెక్టులకు నీళ్ల ఎత్తిపోయకుండా రైతుల పొట్టగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 22ఏ జాబితాలో లక్షలాది ఎకరాలు పెట్టి ప్రజలకు నరకం చూపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ తీరును తాము ప్రశ్నిస్తే.. సమస్యను పరిష్కరించకుండా తమపైనే ఎదురుదాడికి దిగుతూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని హరీశ్ విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే స్వయంగా అసెంబ్లీ సాక్షిగా ఈ విషయాన్ని ఒప్పుకొన్నారని తెలిపారు. సమయం తకువ ఉండటంతో కలెక్టర్లు ఆగమాగం భూములను నిషేధిత జాబితాలో పెట్టారని ముఖ్యమంత్రి చెప్పారని గుర్తుచేశారు. ఏకంగా 30 లక్షల ఎకరాలను 22ఏలో పెడితే ఆ రైతులు, ప్రజలు ఎంత ఇబ్బంది పడి ఉంటారో ఆలోచించాలని చెప్పారు. రైతుబంధు రాక, యూరియా అందక, పిల్లల పెండ్లిళ్లు, చదువుల కోసం భూములు అమ్ముకోలేక లక్షలాది మంది నానా అవస్థలు పడుతున్నారని వాపోయారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఇన్నాళ్లవుతున్నా ఎందుకు విచారణ చేపట్టలేదని, పర్యటనల పేరిట ఇప్పుడే ఎందుకు హంగామా చేస్తున్నారని నిలదీశారు. 22ఏతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను బీఆర్ఎస్ లేవనెత్తినప్పటి నుంచీ, ముఖ్యమంత్రి తమ్ముళ్ల భూ కుంభకోణాలను బయటపెట్టినప్పటి నుంచి, మంత్రి పొంగులేటి, ఆయన కొడుకు భూ దందాలను ఎండగట్టినప్పటి నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం కుళ్లు బుద్ధితో కక్షగట్టి తమపై ఎదురుదాడి చేస్తోన్నదని మండిపడ్డారు. తన ఆస్తుల గురించి ప్రజలకు తెలియందేమీ లేదని హరీశ్ వివరించారు. ప్రతి ఎన్నికల అఫిడవిట్‌లో తన ఆస్తుల వివరాలను పూర్తిగా వెల్లడించానని, అన్నీ చూసిన తర్వాతే ప్రజలు తనకు ఓట్లు వేసి గెలిపించారని చెప్పారు. అయినా కాంగ్రెస్ నేతలు అక్రమాలు జరిగినట్టు అభూత కల్పనలు సృష్టిస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఏకపక్షంగా సస్పెండ్ చేశారని, తాము సభకు వస్తామని కోరినా ప్రభుత్వం వినలేదని చెప్పారు. సభలో ప్రతిపక్షం ఉంటే ప్రభుత్వ బండారం బయటపడుతుందనే తమను సస్పెండ్ చేసి ఏకపక్షంగా సభ నడిపించారని విమర్శించారు. కాంగ్రెస్ ఎంపీల బృందం సిద్దిపేటకు వచ్చి పెద్ద హంగామా చేశారని హరీశ్ తెలిపారు. ఎవరు వచ్చినా అతిథి మర్యాదలు చేయడం సిద్దిపేట సంస్కృతి అని, అందుకే స్థానిక ఎమ్మెల్యేగా వారిని స్వాగతించి భోజనానికి ఆహ్వానించానని తెలిపారు. కావాలంటే దగ్గరుండి తానే తన వ్యవసాయ భూమిని చూపిస్తానని, వారి అనుమానాలను నివృత్తి చేస్తానని చెప్పారు. తన వ్యవసాయ భూమిలో విలాసవంతమైన ఫామ్ హౌస్ ఉన్నదని ముఖ్యమంత్రి, ఎంపీలు అంటున్నారని, తన భూమిలో విలాసవంతమైన భవనాలు కాదుకదా కనీసం బాత్రూం కూడా లేదని స్పష్టంచేశారు. ఎంపీలు యాత్రలు, దండయాత్రలు చేయడానికి చాలా అంశాలున్నాయని హరీశ్ సూచించారు. కేసీఆర్ హయాంలో కాళేశ్వరంతో పాటు ఏడు ప్రాజెక్టులకు అనుమతులు సాధిస్తే, ఇప్పుడు ఆ ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేయాలని కేంద్రం జీఆర్ఎంబీ ఎజెండాలో పెట్టిందని తెలిపారు. దీనిపై కాంగ్రెస్ ఎంపీలు కేంద్రంపై దండయాత్ర చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ అక్రమంగా ప్రాజెక్టులు కడుతూ గోదావరి నీళ్లను ఎత్తుకుపోవాలని చూస్తుంటే సీడబ్ల్యూసీపై కాంగ్రెస్ ఎంపీలు దండయాత్ర చేయాలని సూచించారు. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, భువనగిరి జిల్లాల మీదుగా పోవాల్సిన రీజినల్ రింగ్ రోడ్డు పనులను కాంగ్రెస్ ప్రభుత్వం పకన పెట్టిందని, ఒక అంగుళం కూడా పనులు ముందుకుపోలేదని విమర్శించారు. మెట్రో ఫేజ్-2, పాలమూరు ఎత్తిపోతల, సీతమ్మ సాగర్ ప్రాజెక్టులకు కేంద్రం అనుమతులు ఇవ్వడం లేదని, వీటి సాధన కోసం, రాష్ట్ర హకుల కోసం కలిసికట్టుగా కేంద్రంపై పోరాడాలని సూచించారు. ఎంపీలు వచ్చి భూములను కొలుస్తామని, రెవెన్యూ అధికారులకు డైరెక్షన్ ఇస్తామని చెప్పడం రెవెన్యూ వ్యవస్థను అవమానించడమేనని హరీశ్ వ్యాఖ్యానించారు. ఎమ్మార్వోలు, ఆర్డీవోలు, కలెక్టర్లు, సీసీఎల్ఏ వంటి ఇంత పెద్ద వ్యవస్థ ఉంటే వారిపై ప్రభుత్వానికి నమ్మకం లేదా? అని ప్రశ్నించారు. 'ఎంపీల బృందానికి ఒకటే చెప్తున్నా.. సీఎం రేవంత్‌రెడ్డి పంపిస్తే మీరు వచ్చింన్రు.. వెళ్లి వాస్తవాలు చెప్పండి.. హరీశ్ రావు బాయికాడ ఏమీ లేదని మీ కండ్లతో చూసింది చెప్పండి' అని సూచించారు. 'ప్రజా సమస్యల నుంచి తప్పించుకోవడానికి బీఆర్ఎస్‌పై ఎదురుదాడి చేసినా మేము ప్రజల సమస్యలపై సర్కార్‌ను వదిలిపెట్టం. ప్రతిపక్షంగా ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నిస్తూనే ఉంటం' అని తేల్చిచెప్పారు.

## నౌకను ఢీకొట్టి మాపైనే నిందలా?

### పాక్ తీరుపై మండిపడ్డ భారత్



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18 :** అరేబియా సముద్రం అంతర్జాతీయ జలాల్లో భారత్-పాక్ యుద్ధ నౌకలు ఢీకొన్న ఘటనలో పాకిస్థాన్ చేస్తున్న ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. పాకిస్థాన్ ప్రత్యేక ఆర్థిక మండలిలో భారత నౌక రెచ్చగొట్టే, ఆమోదయోగ్యం కాని చర్యలకు పాల్పడిందని ఆ దేశ విదేశాంగశాఖ చేసిన ఆరోపణలు అసంబద్ధమైనవని స్పష్టం చేసింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్‌వాల్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. దాయాది దేశం తీరుపై మండిపడ్డారు. "నౌకను ఢీకొట్టిన వ్యవహారంపై పాక్ రాయబారికి సమన్లు జారీ చేసిన అనంతరం ఆ దేశ ప్రతిస్పందన చూశాం. భారత్‌పై నిందలు వేసేందుకు చేసిన వారి ప్రయత్నాలన్నీ ముందస్తుగా ఊహించినవే. వారి ఆరోపణలను తిరస్కరిస్తున్నాం. ప్రమాదకర విన్యాసాలు, కసరత్తులు చేసి.. 1991లో భారత్-పాక్ చేసుకున్న ఒప్పందంలోని అంశాలను పాక్ ఉల్లఘించింది. సముద్రంలో ఢీకొనడాన్ని నిరోధించే అంతర్జాతీయ నిబంధనలను సైతం పాటించకుండా తీవ్ర ఉల్లంఘనలకు పాల్పడింది" అని జయ-స్వాల్ స్పష్టం చేశారు. అయితే, ఈ ఘటనలో భారత నౌకాదళానికి చెందిన యుద్ధనౌక ఐఎన్ఎస్ కోల్‌కతాకు పెద్దగా నష్టం జరగలేదని, ప్రస్తుతం సముద్రంలోనే ఉందన్నారు.




## రక్షణ రంగ ప్రాజెక్టులు సకాలంలో పూర్తి కావాలి

### రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

**బెంగళూరు, సెప్టెంబర్ 18 :** రక్షణ రంగ ప్రాజెక్టులు నిర్దిష్టమైన కాలపరిమితితో పూర్తి కావాలని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. ప్రాజెక్టులు ఆలస్యమయ్యే కొద్దీ వ్యయం పెరగటమే కాకుండా సాంకేతికత మారిపోతుందన్నారు. శుక్రవారం ఆయన బెంగళూరులో హెచ్‌ఏఎల్ రూపొందించిన రెండు తేలికపాటి యుద్ధ విమానాలు (ఎల్‌సీఏ), మూడు (హెచ్‌టీటీ-40) హిందూస్థాన్ టర్బో ట్రైనర్లు-40(అంకుర్)ను భారతీయ వైమానిక దళానికి అందించారు. ధ్రువ్ నెక్స్ట్ జనరేషన్ (ఎన్‌జీ) నాలుగు హెలికాప్టర్లను పవర్ హన్స్ లిమిటెడ్ (పీహెచ్‌ఎల్)కు అందజేశారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం రక్షణ రంగ ఉత్పత్తుల కోసం దిగుమతులపై ఆధారపడే పరిస్థితి తగ్గిపోయిందన్నారు. రక్షణ, వైమానిక, పౌరవిమానయాన రంగాల్లో స్వదేశీ ఉత్పత్తుల వినియోగం ఈ రంగ విస్తృత ప్రగతికి నిదర్శనమన్నారు. గతంలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల మధ్య పోటీ ఉండగా.. ప్రస్తుతం సమన్వయం దిశగా వెళ్తున్నట్లు మంత్రి వెల్లడించారు. కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. హెచ్‌ఏఎల్ సంస్థ రక్షణ, పౌర విమానయాన రంగాలకు అందించిన ఈ ఉత్పత్తుల ద్వారా విజ్ఞానం ద్వారా సేవ చేయటం ఎలాగో జాతికి నేర్పిందన్నారు. రక్షణ రంగ ఉత్పత్తులు 12 ఏళ్లలో నాలుగు రెట్లు పెరిగాయని చెప్పారు. ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో చిప్‌ల నుంచి షిప్స్ వరకు స్వదేశీ పరిజ్ఞానంతో తయారవుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఏఎల్ సీఎండీ కె.రవి, భారతీయ వైమానికదళం చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్ ఏపీ సింగ్, రక్షణ శాఖ డిఫెన్స్ ప్రొడక్షన్ కార్యదర్శి సంజీవ్ కుమార్, పౌర విమానయాన శాఖ కార్యదర్శి సమీర్ కుమార్ సిన్హా తదితరులు పాల్గొన్నారు.



## బెంగాల్ ఉప పోరు..

### దీదీ వర్గానికి 'ఫుట్‌బాల్ ప్లేయర్' గుర్తు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18 :** పశ్చిమ బెంగాల్‌లో ఉప ఎన్నికల నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వర్గం పార్టీ పేరు ఖరారైంది. ఆమె నేతృత్వంలోని పార్టీకి 'మమతా ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' పేరును ఎన్నికల సంఘం ఖరారు చేసింది. వీరికి ఫుట్‌బాల్ ప్లేయర్ గుర్తును కేటాయించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మరోవైపు, అరుప్ రాయ్ నేతృత్వంలోని రెబల్స్ గ్రూప్‌నకు డెమోక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్ పేరుతోపాటు ఎన్వెలప్‌ను చిహ్నంగా కేటాయించినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. పశ్చిమ బెంగాల్‌లో నందిగ్రామ్‌తోపాటు రెజీనగర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు అక్టోబర్ 6న ఉప ఎన్నికలు జరగనున్నాయి. అయితే, తృణమూల్ కాంగ్రెస్ ఇటీవల రెండుగా చీలిపోవడం.. తమదే అసలైన పార్టీ అని ప్రకటించుకోవడంతో ఇరువర్గాల మధ్య వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఉప ఎన్నికల్లో పార్టీ పేరు, దాని ఎన్నికల చిహ్నమైన "పూలు గడ్డి"ని ఉపయోగించరాదని ఇరువర్గాలకు ఎన్నికల సంఘం ఆదేశాలిచ్చింది. చీలిక వర్గాలు ఉపయోగించ దలచిన ఎన్నికల చిహ్నాలను, పేర్లను శుక్రవారం ఉదయం లోగా తెలియజేయాలన్న ఈసీ .. తాజాగా కొత్త పేర్లను ఖరారు చేసింది. ఉప ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకంగా ఈ మధ్యంతర ఏర్పాట్లు చేశామని, వివాదంపై తుది నిర్ణయం తీసుకునే వరకు ఇది అమలులో ఉంటుందని తెలిపింది.



## అమెరికాకు వ్యతిరేకంగా ఇరాన్‌లో భారీ ర్యాలీ

**టెహ్రాన్, సెప్టెంబర్ 18 :** అగ్ర రాజ్యం అమెరికా తీరుపై ఇరాన్‌లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. యుద్ధం మొదలై నెలలు గడుస్తున్నా.. దుందుడుకు చర్యలు ఆగడం లేదంటూ శుక్రవారం లక్షలాది మంది ఇరాన్ పౌరులు భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. దేశం కోసం తాము కూడా ఆయుధాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రతిజ్ఞ చేశారు. అమెరికా, ఇజ్రాయెల్ నాశనమవ్వాలంటూ నినాదాలు చేశారు. యుద్ధం మొదలైన తర్వాత ఇరాన్‌లో చేపట్టిన అతి పెద్ద ర్యాలీ ఇదే. దేశ ఐక్యతను ప్రతిబింబించేలా ప్రభుత్వ సూచన మేరకు శుక్రవారం భారీ సంఖ్యలో ఇరాన్ పౌరులు రోడ్ల మీదకు వచ్చారు. జాతీయ పతాకాన్ని చేతబట్టి నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. ఇరాన్ పోర్టులను దిగ్బంధనం సహా పలు ఆంక్షలు విధించడంపై మండిపడ్డారు. పరిమిత సైనిక శిక్షణ తీసుకొని, దేశ రక్షణ కోసం స్వచ్ఛందంగా ముందుకొచ్చిన యువత.. సైనిక దుస్తులు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. వీళ్లంతా పారామిలిటరీ రివల్యూషనరీ గార్డ్స్‌కు అదనపు లేయర్‌గా వ్యవహరించనున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ వ్యతిరేక నిరసనలను అడ్డుకోవడంలో కీలక పాత్ర పోషించనున్నారు. అమెరికా చర్యల నేపథ్యంలో తన బలాన్ని చాటుకునేందుకు ఇరాన్ ప్రభుత్వం ఈ ర్యాలీ నిర్వహించింది. ఈ ర్యాలీలో పాల్గొనేందుకు 6 లక్షల మందికిపైగా రిజిస్టర్ చేసుకోగా.. దాదాపు 10 లక్షల మందికి పైనే పాల్గొన్నారని టెహ్రాన్ గార్డ్ చీఫ్ జనరల్ హసన్ వెల్లడించారు.

## మసీదులో ఆత్మాహుతి దాడి

### పాక్‌లో 16మంది మృతి

**ఇస్లామాబాద్ :** పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రాంతంలో ఓ మసీదులో ప్రార్థనలు జరుగుతోన్న సమయంలో ఓ వ్యక్తి ఆత్మాహుతి దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో 16 మంది మరణించగా, 50 మందికి పైగా గాయపడ్డారు. మృతుల్లో ఐదుగురు పోలీసు సిబ్బంది కూడా ఉన్నారు. మసీదు ప్రాంతాన్ని భద్రతా బలగాలు తమ ఆధీనంలోకి తీసుకొని తనిఖీలు చేపట్టాయి. అధికారులు, రెస్క్యూ బృందాలు ఘటనాస్థలికి చేరుకుని సహాయకచర్యలు ప్రారంభించాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ దాడికి బాధ్యత వహిస్తూ.. ఏ ఉగ్ర సంస్థ ఇంతవరకు ప్రకటన చేయలేదు.

## ఓటు దొంగలు.. ఇప్పుడు పార్టీల దొంగలుగా మారారు

### కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18 :** భాజపా, కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో జరగనున్న ఉప ఎన్నికల్లో టీఎంసీ గ్రూప్‌లు.. ఆ పార్టీ పేరు, ఎన్నికల గుర్తును వాడకుండా ఈసీ ఇచ్చిన ఆదేశాలను తప్పుబట్టారు. ప్రజా తీర్పును రక్షించడమే ఎన్నికల సంఘం బాధ్యత అన్నారు. కానీ దానికి వ్యతిరేకంగా అది ప్రజల తీర్పును తారుమారు చేసే శక్తులకు సహకరిస్తోందని దుయ్యబట్టారు. పార్టీలను విడగొట్టి.. ఎన్నికల గుర్తును లాక్కోవడం ఈసీ, భాజపాలకు అలవాటైపోయిందన్నారు. 'మొదట శివసేన, ఆ తర్వాత ఎన్సీపీ.. ఇప్పుడు తృణమూల్ కాంగ్రెస్. ప్రతిసారీ ఇదే పద్ధతి. ఒక పార్టీని చీల్చడానికి భాజపా, ఎన్నికల సంఘం చేతులు కలుపుతాయి. ఆ తర్వాత దాని ఎన్నికల గుర్తును లాగేసుకుంటాయి. ఒక పార్టీ మొత్తాన్నే దొంగలించగలిగినప్పుడు, కోట్లాది మంది భారతీయుల ఓట్లను కూడా చోరీ చేయడంలో ఆశ్చర్యం లేదు. ఓటు దొంగలు, ప్రభుత్వ దొంగలు.. ఇప్పుడు పార్టీల దొంగలుగా మారారు. ఈ చర్యలు మన ప్రజాస్వామ్య పతనానికి చిహ్నాలుగా మారాయి. పార్టీని కాపాడుకోవాలనే ఈ పోరాటం కేవలం మమతా బెనర్జీది మాత్రమే కాదు. ఇది స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు కోరుకునే ప్రతి రాజకీయ పార్టీ, ప్రతి ఓటరు పోరాటం' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.



## లేఅవుట్లలో మౌలిక వసతుల కల్పనకు రూ.1,548 కోట్లు

### సీఆర్డీఏ నిర్ణయం

**అమరావతి:** ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 66వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో అసెంబ్లీ ఐకానిక్ భవనంపై 250 మీటర్ల స్పైర్ నిర్మాణానికి రూ.662 కోట్లతో టెండర్లు పిలిచేందుకు ఆమోదం లభించింది. 29 గ్రామాల ఎల్‌పీఎస్ లేఅవుట్లలో మౌలిక వసతుల కల్పనకు రూ.1,548 కోట్లతో పనులు చేపట్టడంతో పాటు పాఠశాలలు, ఇతర సంస్థలకు భూ కేటాయింపులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రెండో దశ భూ సమీకరణలో ఎకరా కంటే తక్కువ భూమి ఉన్న రైతులకు కూడా రూ.40 వేల చొప్పున కౌలు చెల్లించనున్నారు. భూ సమీకరణలో ఎవరినీ బలవంతం చేయబోమని, అక్టోబర్ చివరినాటికి రెండో దశ భూసమీకరణ 80శాతం పూర్తి చేస్తామని మంత్రి నారాయణ తెలిపారు. అమరావతి విమానాశ్రయ నిర్మాణ ప్రతిపాదనలపై వచ్చే మంత్రివర్గ సమావేశం ముందుకు తీసుకురానున్నట్లు వెల్లడించారు.

## అంబటి రాంబాబుకు ఈడీ నోటీసులు



**గుంటూరు:** వైకాపా నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసింది. ఇందుకు సంబంధించి అధికారులు ఫోన్ ద్వారా ఆయనకు సమాచారం ఇచ్చారు. విచారణకు రావాలని ఈనెల 11నే నోటీసులు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. విచారణకు తమ కార్యాలయానికి రావాలని సమాచారం ఇచ్చారు. నోటీసులు ఏ కేసులో ఇచ్చారో.. ఎందుకు ఇచ్చారో తనకు తెలియదని అంబటి రాంబాబు తెలిపారు.



## ఔటర్‌పై ఉల్లంఘనలకు టెక్నాలజీ నిఘా

**అధునాతన వ్యవస్థలపై సీపీ సమీక్ష**

**శేరిలింగంపల్లి, నేడు న్యూస్:** ఔటర్ రింగ్‌రోడ్డుపై ట్రాఫిక్ ఉల్లంఘనలను అరికట్టేందుకు సాంకేతికతను విస్తృతంగా వినియోగించనున్నట్లు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ గ్రోత్ కారిడార్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించిన ఆయన.. రియల్‌టైమ్ ట్రాఫిక్ నిఘా, ఆటోమేటెడ్ ఉల్లంఘనల గుర్తింపు, రోడ్డు భద్రతకు సంబంధించిన సాంకేతిక ఏర్పాట్లను సమీక్షించారు. ఒకే కెమెరాతో పలు రకాల ట్రాఫిక్ ఉల్లంఘనలను గుర్తించే బహుళ ఉల్లంఘనల గుర్తింపు వ్యవస్థ పనితీరును సీపీ పరిశీలించారు. వీడియో విశ్లేషణ, స్వయంచాలకంగా ఉల్లంఘనలను గుర్తించే సదుపాయాల ద్వారా ట్రాఫిక్ నియంత్రణ, నిబంధనల అమలును మరింత సమర్థంగా చేపట్టవచ్చని అధికారులు వివరించారు. ఔటర్ రింగ్‌రోడ్డుపై ట్రాఫిక్ క్రమశిక్షణ పెంపు, ప్రమాదాల నివారణ, రోడ్డు భద్రత మెరుగుదల కోసం అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంపై అధికారులతో సీపీ చర్చించారు.

## శేరిలింగంపల్లిలోనూ ఉప ఎన్నిక?

**దానం నాగేందర్ తీర్పు పార్టీ ఫిరాయింపులకు గుణపాఠం: చిర్రా రవీందర్ యాదవ్**





**శేరిలింగంపల్లి, నేడు న్యూస్:** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత పై హైకోర్టు తీర్పు పార్టీ ఫిరాయింపులకు గుణపాఠం అని ఉద్యమ నాయకుడు చిర్రా రవీందర్ యాదవ్ అన్నారు. ప్రజలు ఏ పార్టీ గుర్తుపై గెలిపిస్తే, ఆ పార్టీని వీడి మారడం ప్రజా తీర్పును అవమానించడమే అని అన్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ విషయంలోనూ త్వరలో అనర్హత వేటు పడుతుందని రవీందర్ యాదవ్ అన్నారు. దీంతో శేరిలింగంపల్లిలో ఉప ఎన్నికకు పరిస్థితులు ఏర్పడతాయని పేర్కొన్నారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించకుండా ప్రజా సమస్యలు, హామీల అమలుపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.



## లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**గుండ్ల పోచంపల్లిలో పంపిణీ చేసిన అధికారులు**

**మేడ్చల్, నేడు న్యూస్:** మేడ్చల్ సర్కిల్ పరిధిలోని గుండ్ల పోచంపల్లి డివిజన్‌లో అర్హులైన పేద కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వీఆర్వో ప్రభు, రేషన్ డీలర్ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొని లబ్ధిదారులకు రేషన్ స్మార్ట్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా గుండ్ల పోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గరిసెల సురేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో రేషన్ కార్డు కీలకంగా ఉంటుందని తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన కుటుంబాలకు ఇప్పుడు కార్డులు అందడం సంతోషకరమన్నారు. అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా తన వంతు కృషి చేస్తానని సురేందర్ ముదిరాజ్ తెలిపారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు బండారి నరేందర్ ముదిరాజ్, బేరి ఈశ్వర్, మేడ్చల్ జిల్లా ఓబీసీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గువ్వ రవి ముదిరాజ్, శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయ అధ్యక్షుడు గడిలా కృష్ణారెడ్డి, గుండ్ల పోచంపల్లి మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బొజ్జ ఆదిలక్ష్మి, జిల్లా మహిళా కాంగ్రెస్ కార్యదర్శి మరిలమ్మ, గుండ్ల పోచంపల్లి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీరంగవరం నవీన్ ముదిరాజ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పులిగళ్ల రాజేశ్వర్, సుతారిగూడ మాజీ ఉప సర్పంచ్ చిల్ల వెంకటేష్ ముదిరాజ్, గుండ్ల పోచంపల్లి డివిజన్ సేవాదళ్ అధ్యక్షుడు చిల్ల సాయి ముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు ఎల్. రవీందర్ గౌడ్, వీరస్వామి, సంపత్ యాదవ్, వెంకటేష్ ముదిరాజ్, మద్దుల మాధవరెడ్డి, సుంకరి శ్రీనివాస్ ముదిరాజ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.





## ఎమ్ఎన్ఆర్ సిరి హైట్స్‌లో నవరాత్రి ఉత్సవాలు

**మహిళలచే సామూహిక కుంకుమ పూజ, లలిత సహస్రనామ పారాయణం**

**పీర్జాదిగూడ, నేడు న్యూస్:** ఎమ్ఎన్ఆర్ సిరి హైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. పీర్జాదిగూడ బండి గార్డెన్స్ సమీపంలోని ఎంఎన్ఆర్ సిరి హైట్స్ అపార్ట్మెంట్ లో నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం మందడి శ్వేత సాయి కిరణ్ రెడ్డి తో పురోహితుడు గణపతి పూజ చేయించి మహిళలచే సామూహిక కుంకుమ పూజ, లలిత సహస్రనామ పారాయణం చేయించారు. అనంతరం మహిళలు సాంప్రదాయ కోలాటం ఆడుతూ అపార్ట్మెంట్ వాసులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో మందడి శ్వేత సాయి కిరణ్ రెడ్డి దంపతులు గణపతి పూజా కార్యక్రమాలను నిర్వహించగా వెల్లెంకి అనిత జయపాల్ రెడ్డి దంపతులు, ఎంఎన్ఆర్ సిరి హైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సతీష్ రెడ్డి, సంపత్ రెడ్డి, యాదగిరి, కిరణ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, ఆంజనేయులు, రాజశేఖర్ రెడ్డి, రాజేష్, వెంకటేశ్, అరవింద్ రెడ్డి, సిరిపురం రంగయ్య, గంగుల సత్తయ్య, అఖిల, శిరీష, శిరీష, స్పందన, మమత, శ్రీలత, సింధు, సంధ్య, అన్నపూర్ణ, ఉపేంద్ర, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు

- ఎన్ఐఎన్ కాలనీలో అన్నప్రసాద వితరణ
- పాల్గొన్న మాజీ మేయర్ తోటకూర అజయ్, మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి, బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్



**బోడుప్పల్, నేడు న్యూస్:** మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని బోడుప్పల్ సర్కిల్‌లో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఎన్ఐఎన్ కాలనీ రోడ్ నంబర్ 4లోని వినాయక మండపం వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ తోటకూర అజయ్, మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదేవిధంగా గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. అనంతరం భక్తులకు, కాలనీవాసులకు అన్నప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో బోడుప్పల్ నగర కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి, మేడ్చల్ జిల్లా బి-బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, బోడుప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మక్ కళ్యాణ్, చెంగిచెర్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల దిలీప్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు దానగాళ్ల యాదగిరి, గందె విశ్వేశ్వర్ గుప్త, డివిజన్ నాయకులు, గంగపుత్ర సంఘం సభ్యులు నాగరాజు, సత్యనారాయణ, కాలనీవాసులు, భక్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భక్తి ప్రపత్తులతో ఉత్సవాలు జరుపుకోవాలి

- బోడుప్పల్ గణేష్ ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్
- కాకతీయ కళానగర్ లో ప్రత్యేక పూజలు చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు





**బోడుప్పల్, నేడు న్యూస్:** గణేష్ నవరాత్రి ఉత్సవాలు బోడుప్పల్ సర్కిల్ పరిధిలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బోడుప్పల్ పరిధిలోని వివిధ కాలనీలలో మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం పలు గణేష్ మండపాలను సందర్శించారు. ఎన్ఎన్ కాలనీ, కాకతీయ కళానగర్, హేమా నగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను సందర్శించి గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన అన్నదాన కార్యక్ర



మాల్లో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా అజయ్ యాదవ్ మాట్లాడుతూ.. గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు. ఉత్సవ కమిటీ సభ్యులు, యువత సమన్వయంతో కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ బోడుప్పల్ నగర మాజీ అధ్యక్షులు పోగుల నర్సింహా రెడ్డి, మేడ్చల్ బి-బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు బొమ్మక్ కళ్యాణ్, చెంగిచెర్ల డివిజన్ అధ్యక్షులు పోగుల దిలీప్ రెడ్డి, నాయకులు దానగాళ్ళ యాదగిరి, సుమన్ నాయక్, విశ్వం గుప్తా, తూర్పాటి యాదగిరి, గోపు రాము, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాల అన్యాక్రాంతంపై చర్యలు చేపట్టండి

- జ్యోతిబాపూలే ప్రజా భవన్ ప్రజావాణిలో ఫిర్యాదు
- మేడిపల్లి మండల తహసీల్దార్ నిర్లక్ష్యం వల్లే ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం
- ఫిర్యాదు చేసిన ఎంసీపీఐ(యు) మండల కార్యదర్శి ముడి మార్టిన్



MARXIST COMMUNIST PARTY OF INDIA (UNITED) MCPI (U) T.S

**మేడిపల్లి, నేడు న్యూస్:** ప్రభుత్వ స్థలాల అన్ని ఆక్రాంతానికి బాధ్యులైన మేడిపల్లి తహసీల్దార్, ఆర్ఐ లపై చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐ(యు) మండల కార్యదర్శి ముడి మార్టిన్ కోరారు. ఈ మేరకు జ్యోతిబాపూలే ప్రజా భవన్ ప్రజావాణిలో శుక్రవారం ఫిర్యాదు చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి మండల పరిధిలోని సర్వేనెంబర్ 103 లోని ప్రభుత్వ స్థలం అధికారులకు, అక్రమ వ్యాపారులకు అడ్డాగా మారిందని తెలిపారు. 2002లో ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను ఆసరా చేసుకుని 2021 నుండి 2026 గత నాలుగైదు సంవత్సరాలుగా ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతానికి గురవుతుందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతానికి గురవుతున్నా రెవెన్యూ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని తెలిపారు. మేడిపల్లి మండలం తహసీల్దారుగా వచ్చిన ప్రతి ఒక్క తహసీల్దార్, ఆర్ఐ సంబంధిత సిబ్బందితోపాటు అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నటువంటి వారికి సహకరిస్తున్నారని వివరించారు. 2002లో ఇచ్చిన పట్టాల కాలపరిమితి దాటి 24 సంవత్సరాలు పూర్తయిన తర్వాత కాలం చెల్లిన పట్టాలకు రిట్ పిటిషన్ నెంబర్లు తెచ్చుకొని యదేచ్ఛగా నిర్మాణాలు జరుగుతున్నా, దీనిపై ప్రతి తహసిల్దార్ కు ఫిర్యాదు చేస్తే నేను ఉన్నప్పుడు జరగడం లేదు, నాకన్నా ముందు జరిగిన వాటికి నేనేలా బాధ్యుడిని అవుతానంటూ అధికారులు తప్పించుకుంటూ కాలయాపన చేస్తున్నారని ఫిర్యాదులో తెలిపారు. అక్రమ నిర్మాణదారులకు సహకరిస్తున్న తహసిల్దార్ పైన విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, ప్రభుత్వ స్థలాన్ని కాపాడి ప్రజాప్రయోజనాల నిమిత్తమై భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా కాపాడాలని ఆయన కోరారు. అదేవిధంగా అక్రమ నిర్మాణదారులను 24 సంవత్సరాల నుండి ఇల్లు నిర్మించుకోకుండా ఇంతకాలం ఎందుకు కాలయాపన చేశారని అడగకుండా వాళ్లకు తగిన సలహాలు సహకారాలు అందించడం వల్లనే ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే సంబంధిత మేడిపల్లి తహసిల్దార్, ఆర్ఐ రాకేష్ పైన విచారణ జరిపించాలని కోరారు. అలాగే, ఈ పట్టాలు ఇంత కాలము ఎక్కడున్నాయి 24 సంవత్సరాల తర్వాత బయటికి ఎలా వచ్చాయి, దీనికి కారకులు ఎవరు విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ముడి మార్టిన్ విజ్ఞప్తి చేశారు.

# బేరం ఆడలేని చోట..

**ధరకు హద్దు-సరిహద్దు ఎవరు, ఎక్కడ, ఎలా.?**

- రోగి నిస్సహాయతే ఆస్పత్రులకు వరం
- నిస్సహాయతను వ్యాపార అవకాశంగా మార్చకూడదు

**హైదరాబాద్, నేడు ప్రతినిధి:** కూరగాయల ధర నచ్చకపోతే మరో దుకాణానికి వెళ్తాం. బట్టల ధర ఎక్కువైతే బేరం చేస్తాం. కానీ ఆసుపత్రి ఐసీయూలో ప్రాణం కోసం పోరాడుతున్నప్పుడు? అక్కడ బేరం ఉండదు, ప్రత్యామ్నాయం ఉండదు, ధర గురించి ఆలోచించే సమయం కూడా ఉండదు. ఈ నిస్సహాయతను వ్యాపార అవకాశంగా మార్చకూడదు. మహారాష్ట్ర ఎఫ్డీఏ వెల్లడించిన కొన్ని గణాంకాలు దేశవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్నాయి. ఒక ఐవి ఇన్ఫ్యూషన్ సెట్ కొనుగోలు ధర రూ.11.05 ఉండగా, దానిపై ముద్రించిన ఎమ్మార్పీ రూ.325 గా ఉన్నట్లు వెల్లడైంది. 10ఎంఎల్ సిరంజి రూ.6.75 కాగా ఎమ్మార్పీ రూ.57.20, ఐవి కాన్యులా రూ.22.50 కాగా ఎమ్మార్పీ రూ.424గా నమోదైంది. కొనుగోలు ధర, ఎమ్మార్పీ మధ్య తేడా మొత్తం ఆసుపత్రి లాభం అని చెప్పలేం. నిర్వహణ, సిబ్బంది, నిల్వ, స్టెరిలైజేషన్ వంటి ఖర్చులు ఉంటాయి. అయితే ఇంత భారీ వ్యత్యాసానికి సమంజసమైన కారణం ఏమిటన్న ప్రశ్నకు మాత్రం సమాధానం కావాలి

**తెలంగాణలో పరిస్థితి ఏమిటి?**

రాష్ట్ర ప్రభుత్వం దీనిపై సమగ్ర ధరల ఆడిట్ నిర్వహించాలి. ప్రైవేటు ఆసుపత్రుల్లో అత్యవసరంగా ఉపయోగించే వైద్య వస్తువుల కొనుగోలు ధర, ఎంఆర్పీ, రోగికి వసూలు చేసిన ధరలను పరిశీలించాలి. బిల్లులో వస్తువు పేరు, తయారీదారు, ఎంఆర్పీ, వసూలు చేసిన ధర స్పష్టంగా ఉండేలా నిబంధనలు కఠినంగా అమలు చేయాలి. ఆసుపత్రులకు న్యాయమైన ఆదాయం అవసరమే. కానీ రోగి నిస్సహాయతకు ధర నిర్ణయించే హక్కు ఎవరికీ లేదు. ప్రభుత్వం ఇక ఆలస్యం చేయకూడదు. రాష్ట్రవ్యాప్తంగా ధరల ఆడిట్ ప్రారంభించి, ఫలితాలను ప్రజల ముందుంచాలి. అసమంజసమైన వసూళ్లు తేలితే చర్యలు తీసుకోవాలి. ప్రాణం ముందు బేరం ఉండకపోవచ్చు. కానీ ప్రాణం పేరుతో వచ్చే బిల్లుకు మాత్రం న్యాయమైన హద్దు ఉండాలి. ఇది దయ కాదు, రోగి హక్కు. ఇది సౌకర్యం కాదు, ప్రభుత్వ బాధ్యత.



– కొలను వెంకటేశ్వర రెడ్డి
ఎస్పీ రిటైర్డ్, తెలంగాణ జైల్స్



## పల్లె, పట్టణ దవాఖానాల్లో మెరుగైన వైద్య సేవలందించాలి

- ఇందులో ఎం.ఎల్.హెచ్.పీలదే కీలక పాత్ర
- నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు
- మేడ్చల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా: కె. ఆనంద్ హెచ్చరిక

**మేడ్చల్, నేడు బ్యూరో:** పల్లె దవాఖానాలు గ్రామీణ, పట్టణ పరిధిలోని ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలను అందించే కీలకమైన కేంద్రాలని, ప్రతి కేంద్రంలో ప్రజలకు అవసరమైన వైద్య సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని మేడ్చల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా: కె. ఆనంద్ సూచించారు. ఎంఎల్‌హెచ్‌పీలు తమ పరిధిలోని ఆశా, ఏఎన్ఎం లతో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. మేడ్చల్ – మల్కాజ్గిరి జిల్లా పరిధిలోని పల్లె దవాఖానాల మెడికల్ ఆఫీసర్లు (ఎం.ఎల్.హెచ్.పీలు), రిపోర్టింగ్ సూపర్వైజర్లతో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా: కె.ఆనంద్ కార్యక్రమాల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ లోని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ఈ సమావేశానికి ఇరు డివిజన్ల ఉప జిల్లా వైద్య అధికారి, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్లు, పల్లె దవాఖానాల ఎంఎల్‌హెచ్‌పీలు, రిపోర్టింగ్ సూపర్వైజర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా డా: కె. ఆనంద్ మాట్లాడుతూ, మాతా, శిశు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గర్భిణీలను ప్రారంభ దశలోనే గుర్తించి నమోదు చేయడం, ఏ.ఎన్.సి పరీక్షలు నిర్వహించడం, హైరిస్క్ గర్భిణీలను గుర్తించి నిరంతరం పర్యవేక్షించడం, అవసరమైన టీకాలు, పోషకాహార సప్లిమెంట్లు అందించడం, ప్రసవానంతర సేవలు అందించడం, అవసరమైన సందర్భాల్లో ఉన్నత వైద్య కేంద్రాలకు సకాలంలో రిఫర్ చేయడం వంటి సేవలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. నవజాత శిశువులు, శిశువులు, పిల్లలలో జన్యుపరమైన లోపాలు, పోషకాహార లోపాలను ముందుగానే గుర్తించి తగిన వైద్య సేవలు, రిఫరల్ సౌకర్యాలు కల్పించాలన్నారు. కిశోర బాలబాలికలకు ఆరోగ్య సలహాలు, పోషకాహార లోపాల గుర్తింపు, అవసరమైన చికిత్స రిఫరల్ సేవలను అందించాలని తెలిపారు. టిబీ నియంత్రణ కార్యక్రమంలో డాట్స్ సేవలను, కుష్ఠు వ్యాధి నియంత్రణలో డీపీఎంఆర్ సేవలను సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ తదితర అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్‌ను నిరంతరం నిర్వహించి, వ్యాధులు గుర్తించిన వారికి చికిత్స, ఫాలోఅప్, చికిత్స కొనసాగింపును పర్యవేక్షించాలని డా: ఆనంద్ సూచించారు.

**మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాలి**

పల్లె దవాఖానాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదలపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన అన్నారు. అవసరమైన జే.ఏ.ఎస్ నిధులు సకాలంలో విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటామని, అందుబాటులో ఉన్న నిధులను ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు సమర్థవంతంగా వినియోగించాలని డా: ఆనంద్ సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి ఆరోగ్య కార్యక్రమం క్షేత్రస్థాయిలో విజయవంతం కావడంలో ఎంఎల్‌హెచ్‌పీలు పాత్ర అత్యంత కీలకమని డా: కె. ఆనంద్ స్పష్టం చేశారు. ప్రతి కార్యక్రమానికి నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో సాధించడంతో పాటు, కార్యక్రమాల పురోగతిని నిరంతరం పర్యవేక్షించడం, రికార్డులు, ఆన్‌లైన్ డేటాను సకాలంలో నమోదు చేయడం, ప్రజలకు అందాల్సిన సేవలను ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా అందించడం సంబంధిత ఎంఎల్‌హెచ్‌పీలదే బాధ్యత అన్నారు.

**నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు:**

విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా, నిర్దేశిత కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయకపోయినా లేదా ప్రజలకు అందాల్సిన సేవల్లో అలసత్వం ప్రదర్శించినా నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని,
డా: ఆనంద్ స్పష్టం చేశారు.




## శ్రీనగర్ కాలనీలో భక్తిశ్రద్ధలతో పూజలు

**ఉప్పల్/ బీరప్పగడ్డ, నేడు న్యూస్:** బీరప్పగడ్డ డివిజన్‌లోని శ్రీనగర్ కాలనీ ఫేజ్--2లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) సందర్శించారు. జిమ్ శ్రీకాంత్, వారి బృందం ఆహ్వానం మేరకు మండపానికి చేరుకున్న ఆయన గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండపం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఇర్షాద్ ఖాన్ పాల్గొని భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిమ్ శ్రీకాంత్, రాఖీ, పవన్, సంపత్, రఘు, రమేష్, శివ, గణేష్ మండపం కమిటీ సభ్యులు, శ్రీనగర్ కాలనీ ఫేజ్--2 పెద్దలు, యువత, మహిళలు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.



## ఎల్‌కే ఆసుపత్రి వద్ద బంధువుల ఆందోళన

**చికిత్సకు రూ.3-4 లక్షలు ఖర్చు చేయించి.. అకస్మాత్తుగా మృతి ప్రకటించారని ఆరోపణ**



**మల్కాజ్‌గిరి, నేడు న్యూస్:** ప్రమాదంలో గాయపడి చికిత్స కోసం మల్కాజ్‌గిరిలోని ఎల్‌కే ఆసుపత్రికి వచ్చిన వ్యక్తి మృతి చెందడంతో బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. చికిత్స సమయంలో పరిస్థితి మెరుగుపడుతుందని చెప్పి రూ.3--4 లక్షలు ఖర్చు చేయించిన అనంతరం అకస్మాత్తుగా మృతి చెందినట్లు చెప్పారని బంధువులు ఆరోపించారు. బంధువుల వివరాల ప్రకారం.. చంద్రబాబు కాలనీకి చెందిన రాజు ఆదివారం ద్విచక్రవాహనంపై నుంచి జారిపడి గాయపడటంతో ఎల్‌కే ఆసుపత్రిలో చేరారు. చికిత్స అనంతరం 80 శాతం వరకు కోలుకున్నారని, మరో మూడు రోజుల్లో డిశ్చార్జ్ చేస్తామని వైద్యులు చెప్పినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే శుక్రవారం ఉదయం రాజు మృతి చెందినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయని, దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. పరిస్థితి తీవ్రంగా ఉన్నట్లు ముందుగానే తెలియజేసి ఉంటే మరో ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స అందించే అవకాశం ఉండేదని వారు పేర్కొన్నారు. చికిత్స పేరుతో డబ్బులు తీసుకుని చివరి వరకు పరిస్థితి బాగుపడుతుందని చెప్పారని, తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు ప్రభుత్వ అధికారులు, సంబంధిత శాఖలను కోరారు.

# డ్రైనేజీ నీటితో చెరువును తలపిస్తున్న రోడ్డు!

- సూర్య నగర్‌లో డ్రైనేజీ నీటితో రహదారి జలమయం
- వాహనదారులు, పాదచారులకు తీవ్ర ఇబ్బందులు
- ఫిర్యాదు చేసిన పట్టించుకోని సర్కిల్ అధికారులు



**మేడ్చల్, నేడు న్యూస్:** డ్రైనేజీ నీరు రోడ్లపై పొంగిపొర్లి చెరువులను తలపిస్తున్నాయి. రోడ్లపై వెళ్లే వాహనదారులు పాదాచారులు దుర్గంధంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ముక్కుపుటాలు అదిరే దుర్గంధంతో ముక్కులు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మేడ్చల్ డివిజన్ పరిధిలోని సూర్యనగర్ కాలనీలో డ్రైనేజీ సమస్య తీవ్రరూపం దాల్చింది. డ్రైనేజీ పొంగిపొర్లడంతో రహదారి మొత్తం మురుగు నీటితో నిండి చెరువును తలపిస్తోంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో గుంతలు ఎక్కడ ఉన్నాయో, వాటి లోతు ఎంత ఉందో స్పష్టంగా కనిపించకపోవడం వాహనదారులకు ప్రమాదకర పరిస్థితులను కల్పిస్తోంది. ముఖ్యంగా



ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

### నెలలో 20 రోజులు ఇదే పరిస్థితి

సూర్యనగర్‌లో డ్రైనేజీ పొంగిపొర్లడం నిత్య సమస్యగా మారిందని కాలనీవాసులు పేర్కొంటున్నారు. నెలలో సుమారు 20 రోజుల పాటు మురుగు నీరు రోడ్డుపైకి వస్తోందని తెలిపారు. దీంతో దుర్వాసన, అపరిశుభ్రతతోపాటు రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కారం కోసం అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ శాశ్వత పరిష్కారం లభించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. తరచూ ఇదే పరిస్థితి పునరావృత మవుతున్నా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### ప్రమాదాలపై స్థానికుల ఆందోళన


రోడ్డుపై మురుగు నీరు నిలిచిపోవడంతో ప్రమాదాల ముప్పు ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీటి కింద గుంతలు కనిపించకపోవడంతో వాహనదారులు అప్రమత్తంగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. పరిస్థితి మరింత తీవ్రం కాకముందే అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు. రోడ్డుపై నిలిచిన డ్రైనేజీ నీటిని తక్షణమే తొలగించడంతోపాటు, డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించి లోపాలను సరిదిద్దాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. భవిష్యత్తులో మురుగు నీరు రోడ్డుపైకి రాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



## శిష్యుడి విజయమే.. గురువుకు అతిపెద్ద గౌరవం

**బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్**

**గాజులరామారం, నేడు న్యూస్:** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని "తెలంగాణ గుర్తింపు పొందిన అఫడబుల్ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రాపసా) గ్రేటర్ కుత్బుల్లాపూర్ ఆధ్వర్యంలో గురు సన్మాన్ పురస్కార్ 2026 కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. గాజులరామారం లోని పద్మావతి కన్వెన్షన్ లో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కేపీ వివేకానంద హాజరయ్యారు. కుత్బుల్లాపూర్ లోని ప్రయివేట్ పాఠశాలలో పనిచేస్తున్న 150 మంది ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుతూ, క్రమశిక్షణతో కూడిన బంగారు భవిష్యత్తును రూపొందించడంలో ఉపాధ్యాయ, ఉపాధ్యాయినిలా కృషి అభినందనీయమని, శిష్యుడి విజయమే గురువుకు అతిపెద్ద గౌరవమని అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయ, ఉపాధ్యాయునీయులు గా అవార్డులు పొందిన ఉపాధ్యాయులపై విద్యార్థులను సన్మార్గంలో తీర్చిదిద్దే బాధ్యత నేటి నుండి రెట్టింపు అయిందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కే. రామేశ్వర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీకాంత్ రెడ్డి, బిర్రు ఆంజనేయులు, ట్రపసా గ్రేటర్ కుత్బుల్లాపూర్ చైర్మన్ కోలా వెంకటేష్ ముదిరాజ్, అధ్యక్షులు వినోద్ జాదవ్, ప్రధాన కార్యదర్శి దయాకర్, కోశాధికారి శ్రీశైలం, ట్రస్మా జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, గడ్డమీది బాలరాజు, సిహెచ్ నరసింహులు, నరసింహులు గౌడ్, శ్యాం, ఆంజనేయులు, వివిధ పాఠశాలలకు చెందిన కరస్పాండెంట్ , పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్రాజ్, అడ్వకేట్ కమలాకర్, తెలంగాణ సాయి, పలువురు నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## గోపనపల్లిలో పక్కకు ఒరిగిన నాలుగంతస్తుల భవనం

- అంజయ్యనగర్ ఘటన మరువకముందే మరో కలకలం
- అక్రమ నిర్మాణాలపై చర్యలకు స్థానికుల డిమాండ్

**శేరిలింగంపల్లి ,నేడు న్యూస్ :** కొండాపూర్ అంజయ్యనగర్‌లో భవనం కూలిన ఘటన మరువకముందే గోపనపల్లిలో మరో నిర్మాణం ప్రమాదకరంగా ఒకవైపునకు ఒరిగింది. ఎన్టీఆర్ నగర్‌లో కేవలం 30 నుంచి 40 గజాల స్థలంలో నిర్మించిన నాలుగంతస్తుల భవనం ఒరిగిపోవడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. నిబంధనలకు విరుద్ధంగా ఇరుకైన స్థలాల్లో బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టడం వల్లే ఇలాంటి పరిస్థితులు తలెత్తుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. భవనం మరింతగా ఒరిగితే పక్కనే ఉన్న ఇళ్లకు, ప్రజలకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో ఇలాంటి అక్రమ నిర్మాణాలపై అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఘటనపై సీఎంసీ అధికారులు పరిశీలించి, నిర్మాణ అనుమతులు, నిబంధనల అమలును పరిశీలించనున్నట్లు తెలిసింది. ప్రమాదం జరిగిన తర్వాత కాకుండా ముందే ప్రమాదకర నిర్మాణాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



## ఉసిరికాయలపల్లిలో కొనసాగుతున్న పెన్షన్ వెరిఫికేషన్

**లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎంపీడీఓ భూక్యా పద్మ**

**కారేపల్లి, నేడు న్యూస్ :** ఉసిరికాయలపల్లిలో పెన్షన్ వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. పెన్షన్ లబ్ధిదారుల వివరాలు, అర్హతలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు అధికారులు గ్రామంలో వెరిఫికేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా లబ్ధిదారుల వివరాలు, సంబంధిత రికార్డులను పరిశీలిస్తూ వెరిఫికేషన్ ప్రక్రియను చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ భూక్యా పద్మ గ్రామంలో జరుగుతున్న పెన్షన్ వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలించారు. లబ్ధిదారుల వివరాలను పరిశీలించి, నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అర్హత కలిగిన లబ్ధిదారుల వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి నమోదు చేయనున్నట్లు తెలిపారు. గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధుల సమన్వయంతో వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. పెన్షన్ లబ్ధిదారులు తమకు సంబంధించిన వివరాలను అధికారులకు అందిస్తూ వెరిఫికేషన్ ప్రక్రియకు సహకరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుగులోత్ వరలక్ష్మి రాజు, ఉప సర్పంచ్ విజయ, వార్డు సభ్యులు అజిత, అరుణ, పంచాయతీ కార్యదర్శి నిరంజన్ పాల్గొన్నారు.

## రాష్ట్రంలో అస్తవ్యస్తమైన పాలన

- బీఆర్ఎస్ హయాంలో నిరంతర విద్యుత్, నిరంతర సాగునీటి సరఫరా
- ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- మాజీ కోఆప్షన్ సభ్యుడు అకిటి నవీన్ రెడ్డి



**మేడ్చల్, నేడు న్యూస్:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా మారిందని మేడ్చల్ మాజీ కోఆప్షన్ సభ్యుడు ఆకిటి నవీన్‌రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం పచ్చని పంటలతో సుభిక్షంగా ఉండేదని, ప్రస్తుతం ప్రజలు విద్యుత్, తాగునీరు, సాగునీరు తదితర సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ కోతలు, నీటి సరఫరాలో అంతరాయాలు పెరిగాయని ఆరోపించారు. కొన్ని ప్రాంతాల్లో వారానికి ఒకరోజు మాత్రమే నీరు అందుతున్న పరిస్థితులు ఉన్నాయని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని నవీన్‌రెడ్డి విమర్శించారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్లు సకాలంలో అందడం లేదని ఆరోపిస్తూ, రూ.4 వేల పింఛన్, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి రైతులకు సాగునీరు, విద్యుత్‌తో పాటు విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్, సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఆయన కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ నేతలపై రాజకీయ వేధింపులు ఆపాలని ఆరోపణ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను రాజకీయంగా ఇబ్బందులకు గురిచేసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని నవీన్‌రెడ్డి ఆరోపించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులపై కేసులు, అరెస్టుల ద్వారా ఒత్తిడి తెస్తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చకు అవకాశం కల్పించాలని కోరారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని నవీన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం తన విధానాలను పునఃసమీక్షించి ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు. వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించి కాంగ్రెస్ పార్టీని మట్టి కరిపిస్తుందన్నారు. ప్రజల సంక్షేమ బిఆర్ఎస్ పార్టీ లక్ష్యమని ఆయన తెలిపారు.

## ఎస్జీఎఫ్ జోనల్ క్రీడల్లో సంస్కార్ విద్యార్థుల సత్తా

**23 మంది విద్యార్థులు జోనల్ స్థాయికి ఎంపిక.. రెండు నెలల్లో 9 క్రీడా విజయాలు**




**మేడ్చల్, నేడు న్యూస్ :** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో దుండిగల్‌లో నిర్వహించిన 70వ మేడ్చల్ జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో సంస్కార్ ఇన్నోవేటివ్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి పాఠశాలకు ఘనత తీసుకు వచ్చారు. వివిధ క్రీడా విభాగాల్లో కలిపి మొత్తం 23 మంది విద్యార్థులు జోనల్ స్థాయికి ఎంపికయ్యారు. పోటీల్లో సాధించిన విజయాలు అండర్-17 కోకో బాలుర విభాగం ప్రథమ స్థానం, అండర్-17 వాలీబాల్ బాలుర విభాగం ప్రథమ స్థానం, అండర్-14 వాలీబాల్ బాలుర విభాగం ప్రథమ స్థానం, అండర్-17 కబడ్డీ బాలుర విభాగం ద్వితీయ స్థానం సాధించారు. అలాగే, జోనల్ స్థాయికి ఎంపికైన క్రీడాకారులు.. అండర్-17 ఖోఖో బాలుర విభాగంలో గణేష్, లక్ష్మణ్ కుమార్, ప్రణీత్ కుమార్, అవినాష్, అండర్-14 ఖోఖో బాలుర విభాగంలో చంద్రశేఖర్, ప్రణవ్, అండర్-14 కోకో బాలికల విభాగంలో రాధిక, దర్శిక, అండర్-17 ఖోఖో బాలికల విభాగంలో మహాలక్ష్మి, అండర్-17 వాలీబాల్ బాలుర విభాగంలో మహేష్ కుమార్, యశ్వంత్, వికాస్ నాయక్, అండర్-14 వాలీబాల్ బాలుర విభాగంలో సాత్విక్, అతునో, శ్రీనిత్ రెడ్డి, అండర్-17 కబడ్డీ బాలుర విభాగంలో ప్రణీత్ కుమార్, త్రిలోక్ రెడ్డి, సుశాంత్, అండర్-17 కబడ్డీ బాలికల విభాగంలో ఎం. మహాలక్ష్మి, అండర్-14 కబడ్డీ బాలుర విభాగంలో దురంత్ కోచ్, దిగ్విజయ్ కోచ్, వర్షిత్ రాజ్, అండర్-14 కబడ్డీ బాలికల విభాగంలో గౌతమి పథకాలు సాధించారు. పథకాలు సాధించిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం అభినందనలు తెలిపింది. జోనల్ స్థాయికి ఎంపికైన విద్యార్థులతో పాటు వారి విజయానికి కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులు ఏ. నరేంద్ర బాబు, మల్లారెడ్డి, ఉపాధ్యాయ బృందాన్ని పాఠశాల కరస్పాండెంట్ బీరం వెంకటేశ్వర రెడ్డి అభినందించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు ప్రతిభ కనబరచడం పాఠశాల సమగ్ర విద్యా విధానానికి నిదర్శనమన్నారు. క్రీడలే ఆరోగ్యానికి పునాది.. క్రీడా ప్రతిభే విద్యార్థుల సమగ్ర వికాసానికి బాట" అనే లక్ష్యంతో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా విద్యార్థుల్లోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు పాఠశాల యాజమాన్యం నిరంతరం కృషి చేస్తుందని చెప్పారు. ఇటీవల మల్లారెడ్డి యంగ్ టైటాన్స్ క్రికెట్ ఛాంపియన్‌షిప్‌లో ప్రథమ స్థానం సాధించి రూ.10 వేల నగదు బహుమతి గెలుచుకున్న సంస్కార్ క్రికెట్ జట్టును ఆయన ప్రత్యేకంగా అభినందించారు. హిందూ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన ఇంటర్-స్కూల్ వాలీబాల్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన జట్టును, సీఎంఆర్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో అండర్-14, అండర్-17 వాలీబాల్ విభాగాల్లో ప్రథమ స్థానాలు సాధించిన రెండు జట్లను కూడా ప్రశంసించారు. కేవలం రెండు నెలల వ్యవధిలోనే వివిధ క్రీడా పోటీల్లో సంస్కార్ విద్యార్థులు తొమ్మిది బహుమతులు సాధించడం పట్ల వెంకటేశ్వర రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఏ. నరేంద్ర బాబు మాట్లాడుతూ గత ఏడాది తమ పాఠశాల విద్యార్థులు స్కూల్ గేమ్స్ సౌత్ జోన్ స్థాయి వాలీబాల్ పోటీల్లో తృతీయ స్థానం సాధించారని గుర్తుచేశారు. కబడ్డీలో నరేంద్రనాథ్ అనే విద్యార్థి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. పాఠశాల యాజమాన్యం అందిస్తున్న నిరంతర ప్రోత్సాహం, తల్లిదండ్రుల సహకారం, విద్యార్థుల క్రీడా స్ఫూర్తి కారణంగా సంస్కార్ విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయిలను దాటి జాతీయ స్థాయికి ఎంపికవుతున్నారని అన్నారు. గత విజయాల నుంచి స్ఫూర్తి పొంది, భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులను రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని నరేంద్ర బాబు తెలిపారు.




## గంగారంతండాలో వినాయకుడిని దర్శించుకున్న కాంగ్రెస్ నాయకులు

**ప్రత్యేక పూజల్లో పాల్గొన్న గుడిపూడి తిరుమల రావు**

**కారేపల్లి, నేడు న్యూస్ :** వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గంగారం తండా గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం భక్తులతో సందడిగా మారింది. గ్రామస్తులు వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు గుడిపూడి తిరుమల రావు గురువారం సాయంత్రం గంగారం తండాలోని వినాయక మండపాన్ని సందర్శించారు. విఘ్నేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినాయకుడి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, గ్రామంలో శాంతి, సమృద్ధి నెలకొనాలని ఆకాంక్షించారు. వినాయక మండపం వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నూకల మోహన్ రావు, భూక్య నాగేశ్వరరావు, నందులాల్, అజ్మీరా చిట్టిబాబు, వస్తాం, శ్రీకాంత్, వంశీకుమార్, అజయ్, సాయికిరణ్, మంగీలాల్, భావసింగ్, సందీప్, ప్రవీణ్, శ్రీధర్, కిషోర్ పాల్గొన్నారు.

## సర్వీస్ వెపన్ ప్రమాదవశాత్తు పేలి పోలీస్ అధికారి మృతి

**నిజామాబాద్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో విషాద ఘటన**



**కారేపల్లి, నేడు న్యూస్:** నిజామాబాద్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో శుక్రవారం విషాద ఘటన చోటుచేసుకుంది. కారేపల్లి మండలం సీతారాంపురం గ్రామపంచాయతీ పరిధిలోని శాంతినగర్‌కు చెందిన హనుమకొండ సతీష్ ప్రమాదవశాత్తు సర్వీస్ వెపన్ పేలడంతో మృతి చెందారు. ప్రస్తుతం ఆయన నిజామాబాద్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌గా (ఆర్ఐ) విధులు నిర్వహిస్తున్నారు. 2009లో ఏఆర్ విభాగంలో పోలీస్ ఉద్యోగంలో చేరిన సతీష్ పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించారు. విధులు ముగించుకుని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు వచ్చిన ఆయన తన సర్వీస్ వెపన్‌ను శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు తుపాకీ పేలినట్లు పోలీస్ వర్గాల సమాచారం. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సతీష్ అక్కడికక్కడే మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనతో పోలీస్ శాఖలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సతీష్ మృతితో సహచర పోలీసు అధికారులు, సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. కారేపల్లి మండలానికి చెందిన సతీష్ పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ సేవలందించిన నేపథ్యంలో ఆయన మృతి స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. సతీష్ మృతిపట్ల కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, సహచరులు సంతాపం వ్యక్తం చేశారు.



## గణేష్ సురక్ష సంకల్ప్‌తో రోడ్డు భద్రతపై అవగాహన

**సికింద్రాబాద్, నేడు న్యూస్:** గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మల్కాజ్‌గిరి కమిషనరేట్ పోలీసుల ఆధ్వర్యంలో 'గణేష్ సురక్ష సంకల్ప్ -- డే-1' కార్యక్రమాన్ని శుక్రవారం వాసవి నగర్‌లో నిర్వహించారు. పోలీస్ కమిషనర్ శ్రీమతి బి. సుమతి, ఐపీఎస్ ఆదేశాల మేరకు, ట్రాఫిక్-1 డిసిపి కె. రాహుల్ రెడ్డి, ఐపీఎస్ పర్యవేక్షణలో వాసవి నగర్ గణేష్ అసోసియేషన్ సహకారంతో స్ట్రీట్ నెం.2లో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏసీపీ ట్రాఫిక్ తిరుమలగిరి డివిజన్ జి. శంకర్ రాజు, కార్ఖానా ఎస్ హెచ్ ఓ అనురాధ, ఎస్ ఐ ఎస్ అశోక్ రెడ్డి, ట్రాఫిక్ తిరుమలగిరి అదనపు ఇన్‌స్పెక్టర్ వి. రామనయ్య, ఎస్సై మారుతి, రోడ్ సేఫ్టీ, సహచారిణి టీమ్ సభ్యులు పాల్గొన్నారు. ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడంతో పాటు బాధ్యతాయుతమైన రోడ్డు వినియోగంపై చైతన్యం కల్పించే లక్ష్యంతో కార్యక్రమం ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసింది.

## కొలుకొండ గుట్టపై విషాదం..

### మిస్సింగ్ వ్యక్తి శవమై గుర్తింపు



**దేవరుప్పుల నేడు న్యూస్ :** దేవరుప్పుల మండలం కొలుకొండ గ్రామ పరిధిలోని గుట్టపై అనుమానాస్పద స్థితిలో పడి ఉన్న వ్యక్తి మృతి ఉదంతం కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించి స్థానిక ఎస్ఐ సృజన్ కుమార్ వివరాలు వెల్లడించారు. పాలకుర్తి మండలం మల్లంపల్లి గ్రామానికి చెందిన గుగులోత్ ప్రేమ్‌కుమార్ వయసు 26 సంవత్సరాలు తండ్రి: దేవ గత నాలుగు నెలలుగా తీవ్రమైన మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలోనే గత మంగళవారం ఆయన ఇంట్లో ఎవరికీ చెప్పకుండా తన బైక్‌పై బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో పాలకుర్తి పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. ఈ నేపథ్యంలోనే కొలుకొండ గ్రామ శివారులోని గుట్టపై ఒక శవం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ సృజన్ కుమార్ మృతదేహాన్ని పరిశీలించి, మృతుడు పాలకుర్తికి చెందిన ప్రేమ్‌కుమార్‌గా గుర్తించారు. ఆయన గుట్ట ఎక్కి ఎక్కువ మోతాదులో నిద్రమాత్రలు లేదా ఇతర టాబ్లెట్లు మింగడం వల్లే మృతి చెంది ఉంటారని ప్రాథమిక విచారణలో తేలింది. మృతుడి తండ్రి గుగులోత్ దేవ ఫిర్యాదు మేరకు దేవరుప్పుల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి విచారణ తర్వాత మృతికి అసలు కారణాలు వెల్లడికానున్నాయి.



## ఘనంగా నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు

### సంగిశెట్టి రవీంద్రసాగర్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్.. వంద మంది మహిళలతో ఆశీర్వాద కార్యక్రమం

**మల్లాపూర్, నేడు న్యూస్:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు నెల రోజుల పాటు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా బీజేపీ మేడ్చల్ కౌన్సిల్ సభ్యుడు సంగిశెట్టి రవీంద్రసాగర్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. అనంతరం వంద మంది మహిళలతో ప్రత్యేక ఆశీర్వాద కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు వీరయ్య, నరేష్, శ్రీనివాస్, కురుమ అంజి, ముకేశ్ సాగర్, డి. యాదగిరి, మహిళా నాయకులు లలిత, పుణ్యవతి, రజిని, రాజ్యలక్ష్మితో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.



## సంప్రదాయ పద్ధతిలో గణనాథుడి నిమజ్జనం

### నాగార్జున నగర్ కాలనీలో విజయలక్ష్మి టెక్స్టైల్స్ ఆధ్వర్యంలో ఊరేగింపు

**కాప్రా, నేడు న్యూస్:** నాగార్జున నగర్ కాలనీలోని విజయలక్ష్మి టెక్స్టైల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి నిమజ్జన కార్యక్రమాన్ని సంప్రదాయ పద్ధతిలో ఘనంగా నిర్వహించారు. సుమారు 200 మంది మహిళలు కేరళ సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని మంగళహారతులు, భాజాభజంత్రీలతో గణనాథుడిని ఊరేగింపుగా కాప్రా చెరువు వద్దకు తీసుకెళ్లారు. ఊరేగింపు సందర్భంగా కుషాయిగూడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ రెడ్డి, ఎస్ఐ వెంకన్న ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గణేష్ ఉత్సవాలను ప్రతి కాలనీలోనూ సంప్రదాయ పద్ధతిలో నిర్వహించి, సంస్కృతి, ఆధ్యాత్మికతను కాపాడాలని నిర్వాహకులు ప్రజలకు సందేశం ఇచ్చారు. సంప్రదాయ పద్ధతిలో గణనాథుడి నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించినందుకు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉప్పల్ నియోజకవర్గ కో-కన్వీనర్ రేగళ్ల సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వాహకులు మమత, సురేష్‌ను కాప్రా చెరువు ఉత్సవ సమితి వేదిక వద్ద శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో దేవరం శైలజ, వెంకటరెడ్డి, ధరణి హాస్పిటల్ అధినేత శ్రీలక్ష్మి శ్రీకర్, శ్రీకాంత్, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు కమల్ పంత్, పవన్ కుమార్, అప్పి నాయక్, రాజు వంశరాజ్, సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## వినాయకుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

### చామకూర మహేందర్ రెడ్డి

**జవహర్ నగర్, నేడు న్యూస్ :** వినాయకుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని బిఆర్ఎస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ చామకూర మహేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం కీసర సర్కిల్ పరిధిలోని చంద్రపురి కాలనీ డివిజన్ సిల్వర్ గల్లీలోని ఉప్పలమ్మ దేవాలయంలో స్థానికులు ఏర్పాటుచేసిన వినాయక మండపానికి బిఆర్ఎస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ చామకూర మహేందర్ రెడ్డి, మాజీ మేయర్ మేకల కావ్య, అధ్యక్షుడు కొండల్ ముదిరాజులు విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రెడ్డి శెట్టి మహేష్ గుప్తా వారిని శాలువాతో ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఉప్పలమ్మ దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో రెడ్డి శెట్టి మహేష్ గుప్త ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో వారు పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బండ కింది ప్రసాద్ గౌడ్, సుధాకర్ చారి, జలంధర్, పాము భాస్కర్, కాసిం, సంతోష్, శ్రీనాథ్ గుప్తా, బోయినపల్లి నరసింహ, స్థానికులు శ్రీనివాస్, వినయ్, హరిబాబు పాల్గొన్నారు.

## ముదిరాజ్ సంఘం వినాయకుడి నిమజ్జన మహోత్సవం

### భక్తిశ్రద్ధలతో గణనాథుడి నిమజ్జనం.. రూ.11,116లకు లడ్డూ ప్రసాదం వేలం



**మేడ్చల్, నేడున్యూస్:** మేడ్చల్ సర్కిల్ పరిధిలోని పూడూరు-- కిష్టాపూర్ డివిజన్ పూడూరు గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి నిమజ్జన మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పాలకుర్తి శివ ప్రసాద్ పంతులు ఆధ్వర్యంలో గణనాథుడికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. గ్రామస్తులు, ముదిరాజ్ సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం వినాయకుడి లడ్డూ ప్రసాదానికి వేలం పాట నిర్వహించగా మేకల కృష్ణ--కృష్ణవేణి దంపతులు రూ.11,116 లకు లడ్డూను కైవసం చేసుకున్నారు. అనంతరం వినాయకుడి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో మెదక్ జిల్లా ఏడుపాయల ఆలయ ప్రాంగణంలోని మంజీరా నది వద్దకు తరలించారు. భక్తుల జయజయధ్వానాలు, ఆధ్యాత్మిక వాతావరణం మధ్య గణనాథుడిని నదిలో నిమజ్జనం చేశారు. నిమజ్జన కార్యక్రమంలో గ్రామస్తులు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.

#### ఏడుపాయల వనదుర్గ భవానీ మాతకు ప్రత్యేక పూజలు

నిమజ్జన కార్యక్రమం అనంతరం గ్రామస్తులు ఏడుపాయల వనదుర్గ భవానీ మాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. కుటుంబాల్లో సుఖశాంతులు నెలకొనాలని, గ్రామం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అలాగే రైతులకు అనుకూలంగా వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడి పంటలు బాగా పండాలని, పంటలకు అధిక దిగుబడులు రావాలని గ్రామస్తులు అమ్మవారిని ప్రార్థించారు. గ్రామ ప్రజలందరికీ మంచి జరగాలని కోరుకున్నారు.

#### ఘనంగా ముగిసిన నిమజ్జన వేడుకలు

ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో ముగిసింది. ఉత్సవ విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ యువజన సంఘం ఉపాధ్యక్షులు జి. పరమేశ్, నీరుడి శ్రీరామ్, మాజీ ఎంపీటీసీ నీరుడి రఘు, సంఘం నాయకులు మర్రిచెట్టు ప్రసాద్, కొండ శ్రీనివాస్, బలబోయిన శివ, గుడిసె నర్సింహా, మర్రిచెట్టు శ్రీనివాస్, కుంట రవి, తిరుమణి రమేష్, వెంకట్, లచ్చు నర్సింహా, మేకల కృష్ణ, సాదె రాజు, అర్జున్, పుట్నాల శోభన్, నీరుడి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ జిల్లాలో పర్యటించిన రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి

### సర్ ప్రక్రియను పరిశీలించిన సీఈవో సుదర్శన్‌రెడ్డి

### సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశం

**మేడ్చల్, నేడు బ్యూరో:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్) నోటీసుల హియరింగ్, ధృవపత్రాల అప్లోడింగ్ లో ఏలాంటి తప్పులు జరుగకుండా పకడ్బందీగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అదేశించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) నోటీసుల హియరింగ్, ధృవపత్రాల ఆప్ లోడింగ్ ప్రక్రియలో భాగంగా ఉప్పల్, హబ్సిగూడ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఎస్.ఐ.ఆర్ హియరింగ్ ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఉప్పల్ జోనల్ కమీషనర్ రాధిక గుప్తా, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డిలు పుష్పగుచ్ఛం అందించి సుదర్శన్ రెడ్డికి స్వాగతం పలికారు. ఓటును నిర్ధారించే ప్రక్రియ, ఎన్నికల సంఘం నిర్ధారించిన ధృవీకరిణ పత్రాల సమర్పణ, క్షేత్రస్థాయి సహాయం, రికార్డుల పరిశీలన, ధృవీకరణ ప్రక్రియను ఆయన స్వయంగా పరిశీలించారు.

#### తగిన సమయంలో పూర్తి చేయాలి:

జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) హియరింగ్ ప్రక్రియను నిబంధనల మేరకు పకడ్బందీగా,





పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలను, సూపర్వైసర్లను, బిఎల్ఓలను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశించారు. జిల్లాలో మ్యాపింగ్ జరగకుండా ఉన్న ఓటర్లు, ఓటర్ కార్డ్ లో ఉన్న వ్యత్యాసాల కేటగిరీలకు సంబంధించిన రికార్డులు, దరఖాస్తుల ధృవీకరణ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, నోటిస్ అందిన ఓటర్లు హియరింగ్‌కు హాజరయ్యే అభ్యర్థుల వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి, అవసరమైన ఆధారాలను ధృవీకరించిన అనంతరం మాత్రమే తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. అర్హత కలిగిన ఓటర్ల వివరాలు క్రమపద్ధతిలో నమోదు అయ్యేలా, సంబంధిత పత్రాల పరిశీలన లో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేసేందుకు తగినంత సిబ్బందిని నియమించి, రోజువారీ లక్ష్యాలు, ప్రామాణిక విధానాలు, సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో పనులను కొనసాగించాలని సూచించారు. హియరింగ్ నిర్వహణ, దరఖాస్తుల పరిశీలన, అభ్యంతరాల పరిష్కారం తదితర అంశాలను సమీక్షించి, ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బిఎల్ఓలు నిర్వహిస్తున్న రిజిష్టర్లను, కంప్యూటర్లో ధవృపత్రాల అప్ లోడింగ్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ తహాసీల్దార్ ఫూల్ సింగ్, డిప్యూటి కమీషనర్, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, సూపర్ వైజర్లు , బిఎల్ఓలు పాల్గొన్నారు.

## మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

### ఇందిరా మహిళా శక్తి మిల్లెట్ ఫుడ్ కోర్ట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీగణేష్

**సికింద్రాబాద్,నేడు న్యూస్:** మహిళలు కేవలం ఇంటికే పరిమితం కాకుండా ఆర్థికంగా స్వావలంబన సాధించి విజయవంతమైన వ్యాపారవేత్తలుగా ఎదగాలన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. మారేడ్‌పల్లిలో 'ఇందిరా మహిళా శక్తి--చైతన్య మహిళా పొదుపు సంఘం మిల్లెట్ ఫుడ్ కోర్ట్' క్యాంటీన్‌ను స్థానిక నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు. క్యాంటీన్ నిర్వాహకురాలు రేణుకను ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి దివంగత ప్రధాని ఇందిరాగాంధీ పేరుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపడుతోందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంలో భాగంగా మహిళా శక్తి క్యాంటీన్లను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. మిల్లెట్స్, పోషక విలువలు కలిగిన ఆరోగ్యకరమైన ఆహారాన్ని ప్రజలకు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## గురువులకు ఘన సత్కారం

**కూకట్‌పల్లి, నేడు న్యూస్:** ఉపాధ్యాయుల సేవలను, అంకితభావాన్ని గౌరవిస్తూ మిత్రా టీమ్ కూకట్‌పల్లి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సుమారు 50 పాఠశాలలకు చెందిన 200 మంది ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏ వి ఓ పి ఏ రాష్ట్ర అధ్యక్షులు మల్లిపెద్ది శంకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, సమాజ నిర్మాణంలో వారి సేవలు అమూల్యమని అన్నారు. జేఎన్టీయూ ప్రొఫెసర్ కుమారస్వామి గుప్తా, బి జీ. పి రంగారెడ్డి జిల్లా వైస్ ప్రెసిడెంట్ శ్రావంతి విశిష్ట అతిథులుగా పాల్గొని ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలల చైర్మన్లకు "గురు శ్రేష్ఠ అవార్డు", ఉపాధ్యాయులకు "గురు రత్న అవార్డు" అందజేసి



ఘనంగా సన్మానించారు. కార్యక్రమ విజయవంతానికి పాఠశాలల చైర్మన్లు రవీందర్ రావు, అశోక్, నరేందర్, మల్లేష్, శ్రీశైలం, ఇంద్రసేనారెడ్డి, వెంకట్ స్వామి, నాగరాజు, రమణ, విష్ణువర్ధన్ తదితరులు సహకరించారు.




## అగ్నిప్రమాదాలు.. విపత్తుల వేళ అప్రమత్తత ఇలాగే!

- చిన్నమడూరు జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు అగ్నిమాపక శాఖ అవగాహన
- గ్యాస్ సిలిండర్ మంటలార్పుటపై ప్రాక్టికల్ ప్రదర్శన
- ఉత్సాహంగా పాల్గొన్న 250 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు

**దేవరుప్పుల నేడు న్యూస్:** ఇళ్లలో గ్యాస్ సిలిండర్ లీకై మంటలు వస్తే భయపడకుండా ఎలా ఆర్పాలో, వర్షాకాలం, ఇతర విపత్తుల సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఫైర్ సిబ్బంది విద్యార్థులకు ప్రాక్టికల్‌గా చూపించారు. దేవరుప్పుల మండలం చిన్నమడూరు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శుక్రవారం విపత్తుల నిర్వహణపై అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో రెండు గంటల పాటు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాలకుర్తి స్టేషన్ ఫైర్ ఆఫీసర్ సీహెచ్. శ్రీరాములు స్వయంగా విద్యార్థులు, ఉపాధ్యాయులకు విపత్తుల వేళ తీసుకోవాల్సిన రక్షణ చర్యలను వివరించారు. ఇళ్లలో గ్యాస్ సిలిండర్ మంటలు వ్యాపిస్తే ఖాళీ బకెట్లను బోర్లించడం, తడి చెద్దరు లేదా గోనె సంచులు కప్పడం, అవేవీ లేకపోతే తడి కర్చీఫ్‌తో గ్యాస్ రంధ్రాన్ని వేగంగా మూసి మంటలు ఆర్పవచ్చని చూపించారు. పాపులు, ఇళ్లలో పెద్ద ఎత్తున అగ్నిప్రమాదాలు జరిగితే తొమ్మిది రంధ్రాల పైపు బ్రాంచ్‌తో నీటిని వేగంగా చిమ్మే విధానాన్ని ప్రదర్శించారు. పెట్రోల్, డీజిల్ వంటి ఇంధనాలతో మంటలు చెలరేగినప్పుడు 'ఫోమ్ బెడ్' (నురగ) ఏర్పడేలా స్ప్రే చేసి మంటలను నియంత్రించే తీరును వివరించారు.

#### అప్రమత్తతే రక్షణ కవచం: హెచ్ఎం కలావతి

కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డా. జి. కలావతి తెలిపారు. చిన్నమడూరు కాంప్లెక్స్ పరిధిలోని నాలుగు పాఠశాలలకు చెందిన 250 మంది విద్యార్థులు, 20 మంది ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొని అవగాహన పొందారన్నారు. వంట చేసేటప్పుడు కాటన్ దుస్తులు ధరించడం, గ్యాస్ లీకైతే కిటికీలు తెరవడం, సెల్ ఫోన్లు ఛార్జింగ్‌లో ఉన్నప్పుడు మాట్లాడకపోవడం వంటి జాగ్రత్తలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది కే. నాగరాజు, సీహెచ్. శ్రీనివాస్, ఏ. కరుణాకర్, బి. గణేష్ విద్యార్థులకు చక్కటి ప్రదర్శనలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎం. మాధవి, ఎన్. మాలతీలత, జి. సుహాసిని, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



## డిజిటల్ చెల్లింపులపై ఛార్జీలు వేస్తే సహించం

### కేంద్రం నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి: సీపీఐ(ఎం)

**కారేపల్లి, నేడు న్యూస్:** యూపీఐ డిజిటల్ లావాదేవీలపై ఛార్జీలు విధించే కేంద్ర ప్రభుత్వ నిర్ణయం పేదలు, మధ్యతరగతి ప్రజలు, చిన్న వ్యాపారులపై అదనపు భారం మోపుతుందని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, సింగరేణి మండల కార్యదర్శి కె. నరేంద్ర అన్నారు. శుక్రవారం కారేపల్లిలో విలేకరులతో వారు మాట్లాడారు. రూ.2 వేలకుపైబడిన యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించే నిర్ణయం అక్టోబర్ 15 నుంచి అమల్లోకి రానున్నట్లు కేంద్రం ప్రకటించిందని వారు తెలిపారు. ఇప్పటికే ప్రజల రోజువారీ జీవితంలో యూపీఐ చెల్లింపులు విస్తృతంగా వినియోగిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం చిన్న వ్యాపారులకు, వినియోగదారులకు ఇబ్బందులు కలిగించే అవకాశం ఉందన్నారు. నల్లధనాన్ని అరికడతామని, డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహిస్తామని గతంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, ఇప్పుడు డిజిటల్ చెల్లింపులపై ఛార్జీల విధింపునకు ప్రయత్నించడం సరికాదని విమర్శించారు. చిన్న దుకాణాలు, టీ కొట్లు, చిరు వ్యాపారాలు, పెట్రోల్ బంకులు తదితర ప్రాంతాల్లో యూపీఐ చెల్లింపులు సాధారణమైపోయాయని, డిజిటల్ లావాదేవీలపై ఎలాంటి అదనపు భారం పడకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. నల్లధనాన్ని వెలికితీసి పేదల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని గతంలో చెప్పిన కేంద్ర ప్రభుత్వం, కార్పొరేట్ సంస్థలకు రాయితీలు ఇస్తూ పేదలను అప్పుల ఊబిలోనే ఉంచుతోందని వారు ఆరోపించారు. యూపీఐ ఛార్జీల నిర్ణయాన్ని కేంద్రం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలను ఐక్యం చేసి కేంద్ర బీజేపీ ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## వినాయక నిమజ్జనం వేళ తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

### రాష్ట్ర సామాన్య ప్రజా పార్టీ అధ్యక్షులు జాకట శ్రీనివాస్



**మేడ్చల్, నేడు న్యూస్:** గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు కొనసాగుతున్న నేపథ్యంలో పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర సామాన్య ప్రజా పార్టీ అధ్యక్షులు జాకట శ్రీనివాస్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక చవితి నుంచి నవరాత్రి ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహిస్తున్నారని తెలిపారు. నిమజ్జన కార్యక్రమాల సమయంలో చెరువులు, కుంటలు, బావులు, ఇతర నీటి వనరుల వద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున తల్లిదండ్రులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇటీవల సంగారెడ్డి జిల్లాలో వినాయక నిమజ్జనం సందర్భంగా ఆరుగురు విద్యార్థులు చెరువులో పడి మృతి చెందిన ఘటనను ఆయన గుర్తు చేశారు. ఇలాంటి విషాద ఘటనలు పునరావృతం కాకుండా పిల్లలను నీటి వనరుల వద్దకు ఒంటరిగా వెళ్లకుండా చూడాలని కోరారు. నిమజ్జన కార్యక్రమాలకు పిల్లలను తీసుకెళ్లే తల్లిదండ్రులు వారిని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని, ప్రమాదకర ప్రాంతాలు, లోతైన నీటి ప్రదేశాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జాకట శ్రీనివాస్ సూచించారు. భక్తి, ఉత్సాహంతో పాటు భద్రతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌పీ పార్టీ రాష్ట్ర నాయకులు, మేడ్చల్ జిల్లా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# 'రామాయణ' ఇంగ్లీష్ వెర్షన్ నిడివిలో మార్పు

రణ్‌బీర్ కపూర్, సాయి పల్లవి జంటగా నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న భారీ బడ్జెట్ చిత్రం 'రామాయణ'. ఈ ఏడాది దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ఇంగ్లిష్ వెర్షన్‌కు సంబంధించి ప్రస్తుతం నెట్టింట ఓ చర్చ జరుగుతోంది. హిందీ వెర్షన్‌తో పోలిస్తే ఇంగ్లిష్ వెర్షన్ నిడివి దాదాపు 30 నిమిషాలు తక్కువగా ఉండనుందని టాక్. విదేశీ ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా ఇంగ్లిష్ వెర్షన్‌లో పలు మార్పులు చేశారట. అక్కడ విడుదలయ్యే చిత్రంలో అసలు పాటలే ఉండవని తెలుస్తోంది. అలాగే కొన్ని సన్నివేశాలకు కూడా కత్తెర వేసినట్లు సమాచారం. సాధారణంగా భారతీయ ప్రేక్షకులు మూడు గంటలకు పైగా నిడివి ఉన్న సినిమాలను, మధ్యలో వచ్చే పాటలను ఆదరిస్తారు. కానీ, అంతర్జాతీయ ప్రేక్షకులకు ఆ శైలి అంతగా నచ్చకపోవచ్చనే ఉద్దేశంతోనే నిర్మాతలు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై చిత్ర బృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఇటీవలే వినాయక చవితి సందర్భంగా ఈ చిత్రంలోని తొలి పాట 'జయ జయ రామ్' విడుదలై విశేషంగా ఆకట్టుకుంది. ఏఆర్ రెహమాన్ సంగీతం అందించిన ఈ పాటను అర్జిత్ సింగ్, శ్రేయా ఘోషల్ ఆలపించారు. ఈ చిత్రంలో రాముడిగా రణ్‌బీర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్, హనుమంతుడిగా సన్నీ దియోల్, లక్ష్మణుడిగా రవి దూబే నటిస్తున్నారు. నమిత్ మల్హోత్రా, యశ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ దీపావళికి 'రామాయణ–పార్ట్ 1' ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.




# కోలీవుడ్‌లోకి కేతిక శర్మ..

టాలీవుడ్‌లో వరుస చిత్రాలతో ప్రేక్షకులను పలకరించినప్పటికీ, ఆశించిన స్థాయిలో సక్సెస్ అందుకోలేకపోయిన అందాల భామ కేతిక శర్మ. 'రొమాంటిక్' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన ఈ అమ్మడు.. ఆ తర్వాత 'లక్ష్య', 'రంగరంగ వైభవంగా', 'బ్రో' వంటి పలు సినిమాల్లో నటించి గ్లామర్‌తో మెప్పించారు. అయితే బాక్సాఫీస్ వద్ద మాత్రం ఆమెకు సరైన హిట్ దక్కలేదు. దీంతో టాలీవుడ్‌లో కొద్దిగా విరామం తీసుకున్న ఈ సుందరి, ఇప్పుడు తన అదృష్టాన్ని కోలీవుడ్‌లో పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. 'మీసయ్య మురుక్కు-2' సినిమాతో ప్రేక్షకులను అలరించబోతున్నారు. టాలెంటెడ్ ఆర్టిస్ట్ ఆది నటిస్తూ స్వయంగా డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రంలో కేతిక కీలక పాత్రలో కనిపించబోతున్నారు. గతంలో వచ్చిన బ్లాక్ బస్టర్ హిట్ సినిమాకు ఇది సీక్వెల్‌గా వస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై కోలీవుడ్‌లో మంచి అంచనాలు ఉన్నాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం సెప్టెంబర్ 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో.. సినిమా ప్రమోషన్స్ జోరుగా సాగుతుండగా, కేతిక తాజాగా మీడియాతో ముచ్చటించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తమిళంలో తనకు ఇదే మొదటి సినిమా అని చెబుతూ కేతిక తన ఆనందాన్ని పంచుకున్నారు. తనకు తమిళం కొంతవరకు అర్థమైనా, మాట్లాడటం మాత్రం పూర్తిగా రాదని తెలిపారు. అయితే ఆ భాషపై పట్టు సాధించేందుకు తాను ఏకంగా నెల రోజుల పాటు ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం తాను తమిళ తరగతులకు హాజరవుతున్నానని, ఈ లెర్నింగ్ ప్రాసెస్ తనకు అద్భుతమైన అనుభవాన్ని ఇస్తోందని చెప్పారు. తమిళనాడు ప్రజల ఆదరణ గురించి మాట్లాడుతూ ఆమె ఎమోషనల్ అయ్యారు. అక్కడి ప్రజలంటే తనకు చాలా ఇష్టమని, తాను చెన్నైకి వెళ్లిన ప్రతీసారి అక్కడి ప్రేక్షకులు, కోలీవుడ్ నటీనటులు తనకు ఇచ్చిన స్వాగతం మరువలేనిదని తెలిపారు. అక్కడ తనకు కేవలం అపారమైన ప్రేమ, ఆప్యాయత మాత్రమే దొరికాయని, అందుకు తాను ఎంతో కృతజ్ఞురాలినని చెప్పారు. తమిళ పరిశ్రమతో తన మనసు పూర్తిగా మమేకమైపోయిందని, ఇక్కడి వాతావరణం చూస్తుంటే తన సొంత ఇంట్లో ఉన్నట్లే ఉంటుందని కేతిక చెప్పుకొచ్చారు.



# థ్రిల్ పంచే.. తుడక్కమ్

రివ్యూ




మోహన్‌లాల్ తనయ విస్మయ వెండితెరకు పరిచయమవుతూ కీలక పాత్రలో నటించిన చిత్రం 'తుడక్కమ్'. మీనూ (విస్మయ మోహన్‌లాల్) తల్లి చిన్నప్పుడే చనిపోవడంతో తండ్రి రవి బాల చంద్రన్ (సాయికుమార్) అన్నీ తానై పెంచుతాడు. తనకు కాళ్లు లేకపోయినా కుమార్తెకు అండగా నిలబడతాడు. మార్షల్ ఆర్ట్స్‌లోనూ శిక్షణ ఇప్పిస్తాడు. ఒకవైపు ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూనే.. మరోవైపు అదే ఊళ్లో చిన్న పిల్లలకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇస్తూ ఉంటుంది మీనూ. వీఆర్‌వోగా పనిచేస్తున్న తండ్రి రవిని ఓ స్థలానికి సంబంధించి అనుమతులు ఇవ్వాలని కొందరు బెదిరిస్తుంటారు. ఒకరోజు కాంపిటేటివ్ ఎగ్జామ్ రాయడానికి స్నేహితురాలు ప్రియతో కలిసి వెళ్లిన మీనూ మిస్సవుతుంది. దీంతో తండ్రి రవి పోలీసులను ఆశ్రయిస్తాడు. అంతా కలిసి మీనూను వెతకడానికి బయలుదేరతారు. మరి మీనూ ఏమైంది? ఎలా మిస్సయింది? పోలీసుల కనిపెట్టారా? ఆమెకు ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి? అన్నది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

## ఎలా ఉందంటే..

సినీ వారసులు వెండితెరకు పరిచయమవుతున్నారంటే ప్రేక్షకుల్లో ఆసక్తి ఉంటుంది. పైగా మోహన్‌లాల్ వంటి విలక్షణ నటుడి కుటుంబం నుంచి వస్తుండటంతో అంచనాలు ఉంటాయి. అందుకు తగినట్లే ప్రేక్షకులు కోరుకునే అన్ని అంశాలతో పాటు, సందేశాన్ని మేళవించి తీర్చిదిద్దిన చిత్రమే 'తుడక్కమ్'. '2018' బ్లాక్‌బస్టర్ మూవీని తీసిన జుడే ఆంథోని జోసెఫ్ 'సర్వైవల్ థ్రిల్లర్'గా తాజా చిత్రాన్ని తీర్చిదిద్దడంలో చాలా వరకూ విజయం సాధించారు. అయితే, కథావస్తువు చాలా చిన్నది కావడం, అనవసర పాటలు, మలయాళ చిత్రాల్లో నెమ్మదిగా సాగే కథాగమనం వంటికి ఈ సినిమాకు స్పీడ్ బ్రేకర్స్‌లా మారడంతో మరింత థ్రిల్ పంచాల్సిన మూవీ ఓకే అనిపిస్తుంది. మీనూ, ఆమె తండ్రి చుట్టూ ఉన్న ప్రపంచాన్ని పరిచయం చేస్తూ కథను ఆరంభించిన దర్శకుడు మెయిన్ పాయింట్‌కు రావడానికి చాలా సమయం తీసుకున్నాడు. బహుశా విస్మయ మొదటి చిత్రం కావడంతో ప్రేక్షకుడు ఆమె నటనను స్వీకరించడానికి సమయం తీసుకుని ఉంటాడు. ఎప్పుడైతే మీనూ ఫోన్ స్విచ్ఛాఫ్ అయి, అందుబాటులో లేకుండా పోతుందో అప్పటి నుంచి కథలో ఉత్కంఠ మొదలవుతుంది. ఇక్కడి నుంచి సాగే పోలీస్ ఇన్వెస్టిగేషన్ ఆద్యంతం ఆసక్తికరంగానే ఉంటుంది. ఇటువైపు పోలీసు ఇన్వెస్టిగేషన్ చూపిస్తూనే సమాంతరంగా మీనూకు ఏమైందో చెబుతూ కథగమనాన్ని నడిపించిన తీరు ప్రేక్షకుడికి అరటిపండు వలిచి పెట్టినట్లు అర్థమయ్యేలా చెప్పే ప్రయత్నం చేశారు. విరామ సమయానికి మీనూని ఇంటికి చేర్చి, ఊహించని ఓ ట్విస్ట్ ఇస్తాడు దర్శకుడు. అక్కడి నుంచి కథ, కథనాలు రివెంజ్ డ్రామాగా మారుతాయి. 'నిజం పెదవి దాటేలోపు.. అబద్ధం ప్రపంచమంతా చుట్టి వస్తుంది' అన్నట్లు మీనూకి ఎదురైన పరిస్థితులను చుట్టు పక్కల వాళ్లు చూసే కోణం, సామాజిక మాధ్యమాల్లో జరిగే చర్చ నేటి పరిస్థితులకు చక్కగా అద్దం పడుతుంది. మహిళల విషయంలో జరిగే చిన్నతప్పును కూడా బయట ఎలా ప్రచారం చేస్తారన్న అంశాలను బాగా చూపించారు. ఇక్కడ మోహన్‌లాల్‌ను తీసుకొచ్చి, సందేశం ఇచ్చే ప్రయత్నం చేశాడు దర్శకుడు. ముఖ్యంగా మహిళలు తమ జీవితంలో ఎదురయ్యే సవాళ్లను స్వీకరించి నిలబడినప్పుడే ముందుకెళ్లగలరన్న ధైర్యాన్ని నింపుతూ సాగే ఆయా సన్నివేశాలు, యాక్షన్ ఎపిసోడ్ అలరిస్తాయి. పతాక సన్నివేశాల్లో విస్మయ యాక్షన్, తనను అంతం చేయడానికి వచ్చిన వారిని కట్టడి చేసే సన్నివేశాలు థ్రిల్ పంచుతాయి. ముఖ్యంగా ఇటీవల వచ్చిన 'బ్లాస్ట్' ఛాయలు కనిపించినా, మహిళా సాధికారత ప్రధాన ఇతివృత్తంగా ఆయా సన్నివేశాలను తీర్చిదిద్దిన విధానం బాగుంది.



# విజయ్‌తో నటించడం అదృష్టంగా భావిస్తున్నా: మమితా బైజు

యూత్‌లో విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకున్న ఈ మలయాళ బ్యూటీ మమిత బైజు, దళపతి విజయ్ కాంబోలో వచ్చిన మూవీ 'జననాయగన్'. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఏకంగా రూ. 300 కోట్లకు పైగా వసూళ్లను సాధించి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. ఈ భారీ చిత్రంలో విజయ్ కూతురిగా నటించిన మమిత, తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్, సహజమైన నటనతో ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నారు. తాజాగా, ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న మమిత బైజు.. కోలీవుడ్ తలపతి విజయ్‌తో కలిసి పనిచేసిన జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఎమోషనల్ అయ్యారు. ఆ సినిమాలో భాగం కావడం తన అదృష్టమని, ఎందుకంటే తాను మొదటి నుంచి విజయ్‌కి వీరాభిమానినని ఆమె మనసులోని మాట బయటపెట్టారు. సినిమా విడుదలైన తర్వాత కూడా తాము పలుమార్లు ఫోన్ ద్వారా మాట్లాడుకున్నామని, ఆ సందర్భంగా తాను ఆయనకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేసినట్లు మమిత తెలిపారు. షూటింగ్ సెట్‌లో విజయ్ ప్రవర్తన గురించి చెబుతూ ఆమె ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. అంత పెద్ద సూపర్ స్టార్ అయినప్పటికీ, ఆయనలో గర్వం అస్సలు ఉండదని.. సెట్‌లో అందరితోనూ చాలా ఆప్యాయంగా, స్నేహపూర్వకంగా మెలిగేవారని చెప్పారు. ముఖ్యంగా తనతో మాట్లాడేటప్పుడు ఆయన ఒక సీనియర్ హీరోలా కాకుండా, తన వయసు వారితో లేదా ఒక మంచి స్నేహితురాలితో మాట్లాడినట్లుగా ఎంతో సాధారణంగా ఉండేవారని ఆమె గుర్తుచేసుకున్నారు. దాంతో ఆయనతో కలిసి పనిచేస్తున్నంత సేపు తనకు ఏమాత్రం టెన్షన్ కలగలేదని, ఎంతో కంఫర్టబుల్‌గా అనిపించిందని వెల్లడించారు. ఎవరైనా సరే విజయ్‌ను చాలా సులభంగా కలవవచ్చని, ఆయన సాదాసీదా స్వభావం తనను ఎంతగానో ఆకట్టుకుందని మమిత ప్రశంసించారు. అంతటి మహానటుడిని కలవడం, ఆయనతో కలిసి నటించే అరుదైన అవకాశం దక్కడం తన సినీ కెరీర్‌లోనే అత్యుత్తమ క్షణాలని మమిత బైజు ఆనందంగా పంచుకున్నారు.

# నెస్లే ఇండియాపై ఎఫ్ఎస్ఎస్ఏఐ లీగల్ యాక్షన్

ప్రముఖ ఎఫ్ఎంసీజీ కంపెనీ నెస్లే ఇండియా లిమిటెడ్ లపై ఫుడ్ సేఫ్టీ, స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా చట్టపరమైన చర్యలకు దిగింది. చంటి పిల్లలకు సంబంధించిన ఆహార ఉత్పత్తుల విషయంలో నిబంధనలు పాటించడంలో విఫలమైనందున లీగల్ యాక్షన్ చేపట్టింది. నాన్ ఎక్సెల్లాప్రో స్టేజ్ 1, లాక్టోజన్ ప్రో 1, మరో ఫాలోఅప్ ఫార్ములా విషయంలో ఇ-కామర్స్ ప్లాట్‌ఫారాల్లో ప్రమోషనల్ మెటీరియల్‌ను గుర్తించినట్లు తెలిపింది. నాన్ ఎక్సెల్లా ప్రో స్టేజ్ 1లో 5ఎమీాం, వే ప్రోటీన్ ఉంటుందని, లాక్టోజన్ ప్రో 1లో వే ప్రోటీన్ సులభంగా జీర్ణం అవుతుందని కంపెనీ పేర్కొనడాన్ని తప్పుబట్టింది. ఫుడ్ సేఫ్టీ, స్టాండర్డ్స్ రెగ్యులేషన్- 2020 కింద చంటిపిల్లల ఆహార ఉత్పత్తుల విక్రయాలను పెంచుకోవడానికి ఉద్దేశించిన ఇలాంటి ప్రకటనలు నిషిద్ధం. అలాగే, పిల్లల ఆహారానికి సంబంధించి ఎలాంటి ప్రకటనలూ ఇవ్వకూడదని 1992 నాటి మరో చట్టం చెబుతోంది. ఈ విషయంలో నెస్లే ఇండియా నిబంధనలు ఉల్లంఘించిందని పేర్కొంది. దీంతో పాటు నెస్లే ఇండియా తయారు చేసిన ఫార్ములాలో బయోటిన్ పదార్థం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేదని గుర్తించింది. మూడు వేర్వేరు అడ్జుడికేషన్ కేసులను నమోదు చేసింది. కంపెనీ నుంచి వివరణ తీసుకున్న అనంతరం ఈ చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో నెస్లే ఇండియా షేర్లు 2 శాతం నష్టంతో 1345 వద్ద ట్రేడవుతున్నాయి.







## మిశ్రమంగా ముగిసిన సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మిశ్రమంగా ముగిశాయి. రోజంతా మోస్తరు శ్రేణిలో కదలాడాయి. చివరికి సెన్సెక్స్ స్వల్ప నష్టాల్లో ముగియగా.. నిఫ్టీ లాభాల్లో స్థిరపడింది. మెటల్ స్టాక్స్ రాణించాయి. సెన్సెక్స్ ఉదయం 74,575.24 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,314.59) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 74,294.96 – 74,728.44 మధ్య కదలాడింది. ఆఖరికి 19.63 పాయింట్ల నష్టంతో 74,294.96 వద్ద ముగిసింది. నిఫ్టీ 75.80 పాయింట్ల లాభంతో 23,346.40 వద్ద స్థిరడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.49గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టీసీఎస్, టైటాన్, ఏషియన్ పెయింట్స్, మారుతీ సుజుకీ, టెక్ మహీంద్రా షేర్లు నష్టాల్లో ముగిశాయి. అదానీ పోర్ట్స్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 103.10 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4378 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



## ఆసియా గేమ్స్.. సెమీస్‌లో అడుగు పెట్టిన భారత మహిళా జట్టు

ఆసియా గేమ్స్ మహిళా క్రికెట్‌లో భారత్ సెమీస్‌కు దూసుకెళ్లింది. పసికూన జపాన్‌పై అలవోకగా విజయం సాధించింది. ఓపెనర్ షఫాలీ వర్మ (40 నాటౌట్: 15 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపులతో 58 పరుగుల లక్ష్యాన్ని రెండు వికెట్లను నష్టపోయి కేవలం 5 ఓవర్లలోనే ఛేదించింది. కమలిని (0) డకౌట్ కాగా.. భారతి (6) నిరాశపరిచింది. షఫాలీతో కలిసి రిచా ఘోష్ (12) ఆటను ముగించింది. జపాన్ బౌలర్లలో నొనొవో, అయక చెరో వికెట్ తీశారు. అంతకుముందు.. శ్రీచరణి 4 వికెట్లతో విజృంభించడంతో జపాన్ చిత్తయ్యింది. ఇక సెమీస్‌లో బంగ్లాదేశ్‌తో టీమ్‌ఇండియా తలపడనుంది. ఈ మ్యాచ్ ఆదివారం జరగనుంది. మరో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో మలేషియాపై శ్రీలంక విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన లంక 160/4 స్కోరు చేయగా.. మలేషియా 74 పరుగులకే పరిమితమైంది. దీంతో ఆదివారం మరో సెమీస్‌లో పాకిస్థాన్‌తో శ్రీలంక తలపడనుంది. ఫైనల్, మూడో స్థానం కోసం మ్యాచ్‌లు మంగళవారం జరుగుతాయి.



## వైభవ్ ఇంకొంత కాలం వేచి చూడాల్సిందే..

### కోచ్ గౌతమ్ గంభీర్

**అఫ్గానిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్‌లో ఒక్క మ్యాచ్‌లోనూ వైభవ్ సూర్యవంశీకి అవకాశం దక్కలేదు. సంజు శాంసన్ వైపే టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్ మొగ్గు చూపింది. ఈ క్రమంలో వైభవ్‌ను ఎందుకు ఎంపిక చేయలేదనే ప్రశ్నలు తలెత్తాయి. జింబాబ్వే టూర్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచిన సంగతి తెలిసిందే. దీనిపై భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ సమాధానం ఇచ్చాడు. అలాగే ఇంగ్లాండ్ సిరీస్‌లో సంజుకు బదులు వైభవ్‌కు అవకాశం కల్పించడం కూడా తన కోచింగ్ కెరీర్‌లో అత్యంత క్లిష్టమైన నిర్ణయమని వ్యాఖ్యానించాడు.**

"సంజు శాంసన్ సత్తా ఏంటో మనందరికీ తెలుసు. టాలెంట్ లేకుండా ఎవరూ వరల్డ్ కప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలవలేరు. జట్టుకు కావాల్సింది చేశాడు. అందుకే, అతడిని పక్కన పెట్టడమనేది నా కెరీర్‌లో అత్యంత కఠినమైన నిర్ణయం. ఇంగ్లాండ్ సిరీస్‌లో ఆడించలేకపోయా. అయితే, కొన్నిసార్లు ఆటగాళ్ల ప్రస్తుత ఫామ్‌ను కూడా పరిగణనలోని తీసుకోవాలి. నా దృష్టిలో వరల్డ్ కప్ కాంబినేషన్‌నే కొనసాగిస్తే మంచిదనిపించింది. ఏదో మూడు, నాలుగు సార్లు విఫలమైనంత మాత్రాన అకస్మాత్తుగా చెత్త ఆటగాళ్లుగా మారిపోరు. ప్రపంచ కప్ నుంచి మరో ప్రపంచ కప్ వరకు అజేయంగా నిలిచి, టైటిల్ గెలిచిన జట్టు అది. కేవలం ఒక సిరీస్ ఫలితం ఆధారంగా జట్టును తక్కువ అంచనా వేయలేం" అని గంభీర్ తెలిపాడు.


### స్పష్టతతోనే ఉన్నాం..

"వైభవ్ సూర్యవంశీ కోణం నుంచి చూస్తే మేం స్పష్టతతోనే ఉన్నాం. అతడు అవకాశం కోసం వేచి చూడాలి. అతడి టాలెంట్ ఏంటో తెలుసు. అయితే, జట్టులో కొత్తగా చేరిన వారి కంటే.. గత కొన్నేళ్లుగా జట్టు తరఫున అద్భుతంగా ఆడుతున్న వారికే తొలుత ప్రాధాన్యం ఉంటుంది. అవకాశం వచ్చిన ప్లేయర్లకు.. జట్టులో కొనసాగేందుకు తగినంత సమయం కూడా ఇవ్వాలి. భారత క్రికెట్‌లో పోటీతత్వం ఉండాలి. డ్రెస్సింగ్ రూమ్‌లో ప్రతిభావంతులు ఎక్కువ మంది ఉండాలని కోరుకుంటాం. 15 ఏళ్ల కుర్రాడైనా.. 30 ఏళ్ల ఆటగాడైనా అవకాశం కోసం వేచి చూడాలి" అని గంభీర్ వెల్లడించాడు.




## వచ్చే ఏడాది దేశీయ మార్కెట్‌లోకి తొలి డెంగీ వ్యాక్సిన్

డెంగీ నివారణకు ఉద్దేశించిన తొలి వ్యాక్సిన్ దేశీయ మార్కెట్‌లోకి త్వరలో అందుబాటులోకి రానుంది. జపాన్‌కు చెందిన వ్యాక్సిన్ తయారీ సంస్థ టకేడా, హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ మధ్య ఈ మేరకు శుక్రవారం ఒప్పందం కుదిరింది. దీంతో మొట్టమొదటి డెంగీ వ్యాక్సిన్ 'క్యుడెంగా' 2027 తొలి అర్ధభాగంలో మార్కెట్‌లోకి రానుంది. ఈ ఒప్పందం ప్రకారం.. వ్యాక్సిన్ పంపిణీ, మార్కెటింగ్‌కు డాక్టర్ రెడ్డీస్ తన దేశవ్యాప్త పంపిణీ మౌలిక సదుపాయాలు, హెల్త్‌కేర్ నెట్‌వర్క్‌ను వినియోగించనుంది. 'క్యుడెంగా'ను భారత్‌లో విడుదల చేసేందుకు సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఇప్పటికే అనుమతిచ్చింది. 4-60 ఏళ్ల వయసుగల వారు మూడు నెలల వ్యవధిలో 0.5 మి.లీ. చొప్పున రెండు మోతాదుల్లో ఈ టీకా వేసుకోవాల్సి ఉంటుంది. గతంలో డెంగీ సోకిందా లేదా అన్నదాంతో సంబంధం లేకుండా, ఎలాంటి ముందస్తు పరీక్షలు అవసరం లేకుండానే దీన్ని తీసుకోవచ్చు. నాలుగు రకాల డెంగీ వైరస్ వేరియంట్ల నుంచి రక్షణ కల్పించేలా క్యుడెంగా టీకాను రూపొందించారు.



## పృథ్వీ షా నిశ్చితార్థం రద్దు

**ముంబయి:** నిల కడ లేమితో కెరీర్లో పతనం చవిచూసిన భారత యువ క్రికెటర్ పృథ్వీ షా.. వ్యక్తిగత జీవితంలోనూ ఒడుదొడుకులు ఎదుర్కొంటున్నాడు. ఆకృతి అగర్వాల్‌తో అతను ఆరు నెలల కిందట చేసుకున్న నిశ్చితార్థం ఇప్పుడు రద్దయింది. కొన్ని కారణాలతో తాము వేరే దారుల్లో ప్రయాణిస్తున్నట్లు ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ద్వారా ఆకృతి వెల్లడించింది.

## ఎక్కువగా అల్లరి చేసేది ఇషాన్ కిషన్

### అభిషేక్ శర్మ

అఫ్గానిస్థాన్‌తో మూడో టీ20లో భారత డ్యాషింగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ సెంచరీతో అదరగొట్టాడు. కేవలం 30 బంతుల్లోనే శతకం సాధించి అద్భుత రికార్డు నమోదు చేశాడు. దీంతో ఆఖరి మ్యాచ్‌లోనూ భారత్ అలవోకగా గెలిచి.. సిరీస్‌నూ క్లీన్‌స్వీప్ చేసింది. అయితే, అంతకుముందు అఫ్గాన్ బోర్డు ఆతిథ్యం ఇచ్చిన ప్రత్యేక ఈవెంట్‌లో ఇరు దేశాల క్రికెటర్లు, అధికారులు, కోచింగ్ సిబ్బంది పాల్గొన్నారు. భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్.. అఫ్గాన్ ప్లేయర్లు ఇబ్రహీం జద్రాన్, మహ్మద్ నబి, గుల్బాదిన్ నైబ్ ఒకే స్టేజ్‌ను పంచుకున్నారు. ఈ సందర్భంగా అభిషేక్ శర్మకు ఎదురైన ఓ ప్రశ్నకు ఆసక్తికర సమాధానం ఇచ్చాడు.

ప్రశ్న: అద్దం ముందు ఏ భారత ఆటగాడు ఎక్కువ సేపు సమయం గడుపుతారు?

అభిషేక్: భారత క్రికెటర్లు ఎవరనే దానిపై నేను కచ్చితంగా సమాధానం ఇవ్వలేను. అఫ్గాన్ ప్లేయర్లలో మాత్రం ఒకరి పేరు చెప్పగలను. ఫజల్‌హక్ ఫరూఖి ఎక్కువ సమయం గడుపుతాడు. ఇక భారత శిబిరంలోనూ ఓ ప్లేయర్ ఉన్నాడనుకుంటా. అతడు శివమ్ దూబే. భారత క్రికెటర్లలో ఎక్కువగా అల్లరి చేసేది ఇషాన్ కిషన్ అని కెప్టెన్ శ్రేయస్‌తోపాటు అభిషేక్ తెలిపాడు. కానీ, ఇషాన్ మాత్రం రవి బిష్ణోయ్ పేరు చెప్పాడు. దీంతో అంతా నవ్వులు చిందించారు.

### అఫ్గాన్ పోరాట స్ఫూర్తి అద్భుతం: శ్రేయస్

"మైదానంలోకి అడుగు పెట్టిన ప్రతిసారి అఫ్గాన్ ఆడే విధానం అద్భుతం. చిరునవ్వుతోనే పోరాడతారు. అందుకే, ఆ జట్టు భారత్‌కు వచ్చినా.. ఐసీసీ ఈవెంట్లలో కలిసినా చాలా సంతోషంగా ఉంటుంది. మేం సిరీస్‌ను గెలిచిన తర్వాత ఇబ్రహీంతో మాట్లాడా. ఓటమిపై నిరుత్సాహపడినా.. గెలవాలనే కాంక్ష మాత్రం తగ్గలేదని చెప్పాడు. అందుకోసం వారి నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటూనే ముందుకు సాగుతారు. గత కొన్నేళ్లుగా భారత్, అఫ్గాన్ క్రికెట్ సంబంధాలు అత్యుత్తమ స్థాయిలో ఉన్నాయి. ఇరు దేశాల అభిమానులూ క్రికెట్‌ను ఆస్వాదిస్తారు. అఫ్గాన్‌లో అద్భుత నైపుణ్యం కలిగిన ప్లేయర్లు ఉన్నారు. ఒక్కసారి విజయాల బాట పడితే.. ఉన్నత స్థానాలకు వెళ్లిపోతారు" అని శ్రేయస్ (రాష్ట్రీవఝుం ×ఎవతీ) తెలిపాడు. భారత్‌కు రావడం ఎప్పుడూ ఆనందంగా ఉంటుందని.. అఫ్గాన్ క్రికెట్‌కు అందించే సహకారం మరువలేమని నబీ వెల్లడించాడు.







## జింబాబ్వేను చిత్తు చేసిన ఆసీస్

హరారే వేదికగా జింబాబ్వేతో జరిగిన రెండో వన్డేలో 84 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే 2–0 తేడాతో ఆసీస్ కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన జింబాబ్వే కెప్టెన్ సికిందర్ రజా తొలుత ఆస్ట్రేలియాను బ్యాటింగ్ అహ్వానించాడు. ఈ క్రమంలో మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 356 పరుగుల భారీ స్కోర్ సాధించింది. స్టార్ ఓపెనర్ ట్రావిస్ హెడ్ (84 బంతుల్లో 112 రన్స్ – 15 ఫోర్లు, 3 సిక్సర్లు) విధ్వంసకర సెంచరీతో చెలరేగగా.. యంగ్ ఆల్‌రౌండర్ కూపర్ కానల్లీ (78), కెప్టెన్ మిచెల్ మార్ష్ (53) అర్ధశతకాలు సాధించారు. ఆఖరిలో ఆలివర్ జాన్ పీక్ (18 బంతుల్లో 41) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. జింబాబ్వే బౌలర్లలో బ్రాడ్ ఎవాన్స్ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం 357 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వే 48.3 ఓవర్లలో 272 పరుగులకే ఆలౌటైంది. జింబాబ్వే బ్యాటర్లలో బ్రెండన్ టేలర్ (39), సికందర్ రాజా (45), ఇన్నోసెంట్ కైయా (34) రాణించినప్పటికీ జట్టును విజయతీరాలకు చేర్చలేకపోయారు. ఆస్ట్రేలియా బౌలర్లలో జోష్ హాజిల్‌వుడ్, కూపర్ కొన్నోలీ, ఆడమ్ జంపా, మాట్ రెన్‌షా తలా రెండు వికెట్లు పడగొట్టారు. ఇక ఈ మ్యాచ్‌లో జింబాబ్వే బ్యాటర్ ఇన్నోసెంట్ కైయా వికెట్ తీయడం ద్వారా వన్డేల్లో 200 వికెట్ల మైలురాయిని జంపా అందుకున్నాడు. తద్వారా ఆస్ట్రేలియా క్రికెట్ చరిత్రలో షేన్ వార్న్ (293 వికెట్లు) తర్వాత వన్డేల్లో 200 పైగా వికెట్లు తీసిన రెండో స్పిన్నర్‌గా నిలిచాడు. అంతేకాకుండా ఆస్ట్రేలియా తరఫున వేగంగా (123 మ్యాచ్‌ల్లో) 200 వన్డే వికెట్లు సాధించిన స్పిన్నర్‌గా షేన్ వార్న్ రికార్డును అధిగమించాడు.



## మెగా ఐపీఓ వేళ..

దిల్లీ: మార్కెట్ ఒడుదొడుకులు, పెద్ద ఐపీఓల హడావుడి నడుమ ఓ చిన్న ఐపీఓ మదుపర్ల మనసు గెలుచుకుంది. ప్లాస్టిక్ పైపింగ్ సొల్యూషన్లు, సంబంధిత ఉత్పత్తులు తయారుచేసే జిందాల్ సుప్రీం (ఇండియా) పబ్లిక్ ఇష్యూకు అనూహ్య స్పందన లభించింది. సబ్‌స్క్రిప్షన్ ముగింపు రోజైన శుక్రవారం నాటికి 181.07 రెట్లు సబ్‌స్క్రిప్షన్ పొందింది. ఎన్ఎస్ఈ డేటా ప్రకారం.. రూ.125 కోట్ల ఐపీఓలో భాగంగా 93,99,600 (93 లక్షలు) షేర్లు విక్రయానికి ఉంచగా.. మొత్తం 1,70,19,83,003 (170 కోట్లు) షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల కేటగిరీ 327.99 రెట్లు సబ్‌స్క్రైబ్ అవ్వగా.. రిటైల్ ఇన్వెస్టర్ల పోర్షన్ 149.34 రెట్లు సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. క్యూఐబీ కోటా 126.41 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యింది. ఐపీఓలో ధరల శ్రేణిని రూ.88–93గా కంపెనీ నిర్ణయించింది. ఈ నిధులను రుణాల చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు కంపెనీ వినియోగించనుంది. విడిభాగాల తయారీ సంస్థ హీరో మోటార్స్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ నేటితో పూర్తయ్యింది. చివరి రోజు పూర్తయ్యేసరికి 6.66 రెట్లు బిడ్లు అందుకుంది. వెయ్యి కోట్ల రూపాయల ఐపీఓలో భాగంగా ధరల శ్రేణిని రూ.79–84గా కంపెనీ నిర్ణయించింది. ఎన్ఐఐ కోటా 9.86 రెట్లు, రిటైల్ పోర్షన్ 8.23 రెట్లు, క్యూఐబీ కోటా 1.49 రెట్లు స్పందన అందుకుంది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ ఐపీఓ పూర్తి సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. రెండోరోజు పూర్తయ్యేసరికి మొత్తం 1.04 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యింది. క్యూఐబీ కోటా 1.32 రెట్లు, ఎన్ఐఐ కోటా 1.46 రెట్లు, రిటైల్ కోటా 69 శాతం, ఉద్యోగులకు కేటాయించిన కోటా 1.42 రెట్లు చొప్పున సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. సెప్టెంబర్ 21తో ఈ ఐపీఓ ముగియనుంది. రూ.22,562 కోట్ల ఐపీఓలో ధరల శ్రేణిని రూ.1700–1785గా నిర్ణయించింది. మరోవైపు, ఎన్ఎస్ఈ జీఎంపీ మరింత క్షీణించింది. రూ.110 ప్రీమియంతో (6.16 శాతం) లిస్టింగ్‌కు రావొచ్చని గ్రే మార్కెట్ ప్రీమియం సూచిస్తోంది.

Printed, published and owned by **VELLENKI JAYAPAL REDDY**, printed at **M/s KAKATIYA PRINTERS**, H-No: 24-91/72/1, Block No. 29, Plot Nos 72, 73 and 74, Lakshminarayana Nagar IDA Uppal, Uppal Mandal, Medchal-Malkajgiri Dist, Telangana-39, Published at H-No: 3-125/92/86, Anaghapuri Colony, Boduppal, Medipally Mandal, Medchal-Malkajgiri Dist, Telangana- 92, Editor: **VELLENKI JAYAPAL REDDY**, Cell No: **9346984911, 9133445456**, RNI NO: TELTEL/2023/84471, website: www.nedudailynews.com, e-mail: vellenkijayapalreddy@gmail.com